మంగళవారం
12-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 170
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సత్యేందర్ జైన్ బెయిల్ పొడిగింపు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి, ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు బెయిల్ కొనసాగుతుందని అత్యున్నత న్యాయస్థానం కేసు విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. కేసును జస్టిస్ బేల ఎం త్రివేది. జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం ఎదుట జాబితా చేసింది. కేసు రెగ్యులర్ కోర్టులో విచారణకు వచ్చిందని జస్టిస్ బేల ఎం త్రివేది పేర్కొన్నారు. సత్యేందర్ జైన్ తరఫున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ వాదనలు వినిపిస్తూ కేసు విచారణను వాయిదా వేయాలని కోరారు.

370 అధికరణానికి సంపూర్ణ సమాధి

- రద్దు రాజ్యాంగబద్ధమే
- సెప్టెంబరు 30 కల్లా ఎన్నికలు జరపాలి
- జమ్మూ-కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

మోదీ ప్రభుత్వం 2019 ఆగస్టు అయిదున జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. ఇది చట్టబద్ధమేనని తేల్చింది. అంటే ఇక జమ్మూ-కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి గత చరిత్రగానే మిగిలిపోతుంది. మొత్తం మీద మోదీ ప్రభుత్వం సుదీర్ఘకాలంగా తమ ఎజెండాలో ఉన్న 370వ అధికరణం రద్దు పంతం నెగ్గించుకోవడం సుప్రీం తీర్పుతో పరిసమాప్తమైంది. 370వ అధికరణం కారణంగానే కశ్మీర్‌లో తీవ్రవాదం చెలరేగుతోందని మోదీ ప్రభుత్వం వాదించింది. ఆ అధికరణం రద్దైన నాలుగేళ్ల తరవాత తీవ్రవాదం తగ్గిన జాడలైతే లేవు. అంటే 370వ అధికరణం రద్దు అయినంత మాత్రాన కశ్మీర్‌లో శాంతి వెల్లివిరియదని తేలిపోయింది. ఈ అధికరణాన్ని రద్దు చేయడానికి రాజ్యాంగ సవరణ కోసం 367వ అధికరణానికి కేంద్ర ప్రభుత్వం తనకు అనువైన వ్యాఖ్యానం చేసుకుందని, ఇది పొరపాటు అని సుప్రీంకోర్టు చెప్పింది. మొత్తం ప్రక్రియలో ఒక అంశం పొరపాటు అయినప్పుడు అసలు ప్రక్రియ ఒప్పెలా అవుతుందో అంతుపట్టదు. అదే సమయంలో జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్రప్రతిపత్తి పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు సైతం ఇవ్వకపోవడం గమనార్హం.

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 307 రద్దుని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సమర్థించింది. వీలైనంత త్వరగా రాష్ట్రహోదాను పునరుద్ధరించాలని, వచ్చే ఏడాది సెప్టెంబరు 30 నాటికల్లా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఇది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, పార్లమెంటు నిర్ణయాన్ని కొట్టిపారేయలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. జమ్మూ-కశ్మీర్ భారతదేశంలో చేరినప్పుడు దానికి సార్వభౌమాధికారం లేదని, కేంద్రం

- మిగతా 2 లో

ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలాయి: రాజా 2లో

జగన్‌కు భారీ షాక్

- ఎమ్మెల్యే ఆర్కే రాజీనామా
- వైసీపీకి గుడ్ బై
- సీటు గ్యారెంటీ లేక నేతల తడబాటు
- మంగళగిరి టికెట్ బీసీలకు కేటాయింపు
- గాజువాక ఇన్‌చార్జి దేవన్ రెడ్డి రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీలో లుకలుకలు బయటపడుతున్నాయి. టికెట్లు రానివారు...రానని భావిస్తున్న వారు బెదిరింపులకు పాల్పడుతున్నారు. తిరుగులేని నేతగా చెప్పుకుంటున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి షాకుల మీద షాకులిస్తున్నారు. తాజాగా వైసీపీలో కీలకనేతగా ఉన్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) శాసనసభ సభ్యత్వానికి, పార్టీకి సోమవారం రాజీనామా చేసి...వైసీపీలో కలకలం సృష్టించారు. ఆర్కేగా గుర్తింపు పొందిన రామకృష్ణారెడ్డి...జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ముద్రపడ్డారు. అలాంటి ఆర్‌కే రాజీనామా సంచలనమే సృష్టిస్తోంది.స్పీకర్ ఫార్మేట్‌లో రాజీనామా లేఖను ఆర్‌కే స్పీకర్ ఓఎస్‌డీకి అందజేశారు. స్పీకర్ అందుబాటులో

- మిగతా 2 లో

వైసీపీ కొత్త ఇన్‌చార్జిలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో కొత్తగా వైసీపీ ఇన్‌చార్జిలను నియమించారు. అక్కడి వారికి కొందరికి స్థానం చలనం, మరికొందరికి ఉద్వాసన పలికారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రాజీనామా అనంతరం వైసీపీ అధిష్ఠానం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో మరో 30 నుంచి 40 మంది ఇన్‌చార్జిలను మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. వెలగపూడి సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద కొత్త ఇన్‌చార్జ్‌ల వివరాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

- మిగతా 2 లో

విశాఖకు రాజధాని తరలించబోమని
హామీ తీసుకోండి

- ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించిన హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: క్యాంపు కార్యాలయాల ముసుగులో విశాఖపట్నానికి రాజధాని తరలింపు పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఏపీ హైకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం వైపు నుంచి రాజధానిని తరలించకుండా ఆదేశాలు తీసుకోవాలని హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదికి సూచించింది. రోస్టర్ ప్రకారం బెంచ్ ముందుకు పిటిషన్ వచ్చిందని, విచారించిన తర్వాతే ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు న్యాయమూర్తి తెలిపారు. ఏపీ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ అభ్యంతరం వ్యక్తం చేస్తుండడంతో దీనిపై మధ్యంతర పిటిషన్ వేసుకోవచ్చని న్యాయమూర్తి సూచించారు. రాజధాని వ్యవహారాలను విచారించే త్రిసభ్య ధర్మాసనం, పాలనాపరంగా ఏం చేయాలనే అంశంపై

- మిగతా 2 లో

పోలవరంపై కేంద్రానికి
చుక్కెదురు

ఏపీ హైకోర్టు నుంచి బదిలీకి సుప్రీం నిరాకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్ట్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పూర్తి

- మిగతా 2 లో

గాజాకు మానవతా సహాయం 2లో

ఇదీ లోకం!

వర్సిటీ భూములకు
రక్షణగా నిలుద్దాం

భూ కబ్జాలను అడ్డుకుందాం
శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ భూములు పరిశీలించిన రామకృష్ణ

విశాలాంధ్ర-జేఎన్టీయూ ఏ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల భూములకు రక్షణగా నిలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఐదు ఎకరాల భూమిని జగనన్న లేఔట్ పేరుతో భూ ఆక్రమణకు కొంతమంది ప్రయత్నించారు. దీనిని కాపాడటానికి ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా శ్రమించింది. అధికారుల అనుమతి లేకుండానే ఆ భూమిని

- మిగతా 2 లో

గాజాకు మానవతా సహాయం

డబ్ల్యుహెచ్‌ఓ పిలుపు

జెనీవా: ఇజ్రాయిల్ దురాక్రమణతో చితికిపోయిన గాజాకు సత్వర మానవతాసహాయం అందించాలని కోరుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) పిలుపునిచ్చింది. 17 సభ్య దేశాల అభ్యర్థన మేరకు, తూర్పు జెరూసలేంతో సహా ఆక్రమిత పలస్తీనా భూభాగంలోని ఆరోగ్య పరిస్థితులపై చర్చించేందుకు జెనీవాలోని డబ్ల్యుహెచ్‌ఓ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డబ్ల్యుహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ మాట్లాడుతూ ఆరోగ్యంపై గాజా యుద్ధం పెను ప్రభావం చూపిందని, ఈ ఘోర విపత్తులో ఆరోగ్యవ్యవస్థ కుప్పకూలిందన్నారు. గాజాలో ఉన్న 36 ఆసుపత్రులలో కేవలం 14 ఆసుపత్రులు మాత్రమే పాక్షికంగా పనిచేస్తున్నాయి. వీటిలో గాజాకు ఉత్తరాన రెండు, దక్షిణాన 12 ఆసుపత్రులు మాత్రమే ఉన్నాయి. ఇజ్రాయిల్ గాజాపై జరిపిన యుద్ధంలో 7,000 మంది పిల్లలతో సహా 17,000 మందికి పైగా మరణించినట్లు టెడ్రోస్ చెప్పారు.

46,000 కంటే ఎక్కువ మందికి గాయాలయ్యాయి. పెద్దసంఖ్యలో ప్రజలు వలసవెళ్లారని తెలిపారు. అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా, రక్షణ కోసం పౌరులకు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. అక్టోబరు 7 నుండి, గాజా, వెస్ట్ బ్యాంక్‌లోని ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలపై 449 కంటే ఎక్కువ దాడులు జరగగా, ఇజ్రాయిల్‌లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలపై 60 దాడులను డబ్ల్యుహెచ్‌ఓ ధృవీకరించిందని టెడ్రోస్ పేర్కొన్నారు.

వైసీపీ కొత్త ఇన్‌చార్జిలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 175/175 లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు పోతోందన్నారు.
కొత్త ఇన్ చార్జుల వివరాలిలా ఉన్నాయి.

1. మంగళగిరి - గంజి చిరంజీవి
2. రేపల్లె - ఈవూరు రాజేశ్
3. గాజువాక- వరికూటి రామచంద్రరావు
4. ప్రత్తిపాడు- బాలసాని కిరణ్‌కుమార్
5. వేమూరు- వరికూటి అశోక్‌బాబు
6. కొండెపి- మంత్రి ఆదిమూలపు సురేశ్
7. తాడికొండ- మేకతోటి సుచరిత
8. సంతనూతలపాడు- మంత్రి మేరుగు నాగార్జున
9. చిలకలూరిపేట- మల్లెల రాజేశ్ నాయుడు
10. గుంటూరు వెస్ట్- మంత్రి విడదల రజని
11 అద్దంకి- పాణెం హనిమిరెడ

బీసీకి టికెట్ కోసం ఆర్కే త్యాగం: అయోధ్య రామిరెడ్డి

బీసీకి టికెట్ ఇవ్వటం కోసం ఆర్కేను త్యాగం చేయాల్సి వచ్చిందని రాజ్యసభ సభ్యుడు, గుంటూరు జిల్లా వైసీపీ పరిశీలకులు అయోధ్య రామిరెడ్డి స్పష్టం చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం వైసీపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. దీనికి ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ నేత గంజి చిరంజీవి తదితరులు హాజరయ్యారు. అనంతరం మీడియాతో అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గం వైసీపీ టికెట్‌ను రాబోయే ఎన్నికల్లో బీసీ పద్మశాలికి ఇవ్వాలని తమ పార్టీ నిర్ణయించిందని చెప్పారు. నాడు రాజకీయ సమీకరణల కారణంగానే ఆర్కే కు మంత్రి పదవి ఇవ్వలేకపోయామని చెప్పారు. ఆర్కే అంచనాలు కాస్త ఎక్కువగా ఉంటాయని వివరించారు. వ్యక్తిగత పనులు వల్లే ఆర్కే రాజీనామా చేశారన్నారు. రాజకీయాల నుంచి విరమించుకునే ఆలోచనలో ఆర్కే ఉన్నారని, అన్నీ ఆలోచించే రాజీనామా చేసి ఉంటారని చెప్పారు. మంగళగిరిలో సీఎం జగన్ నాయకత్వం బలపరిచే విధంగా, ఎమ్మెల్యే ఆళ్ల క్యాడర్ రూపొందించారని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మంగళగిరి నుంచి వైసీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని స్పష్టం చేశారు.

బ్రిటన్‌లో పలస్తీనా అనుకూల నిరసనలు

లండన్: గాజాపై ఇజ్రాయిల్ బాంబు దాడులకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేస్తూ... వందలాది మంది బ్రిటన్‌లో భారీ ప్రదర్శన చేపట్టారు. లివర్‌పూల్ మెట్రోపాలిటన్ కేథడ్రల్ వెలుపల జరిగిన ఈ ప్రదర్శనకు లేబర్‌పార్టీ నాయకుడు జెరిమీ కార్బిన్ సారథ్యం వహించారు. కార్బిన్ మాట్లాడుతూ చాలా మంది రాజకీయ నాయకులు పలస్తీనా ప్రజలకు మద్దతు ఇవ్వడం కంటే ఆయుధ వ్యాపారానికి లొంగిపోవడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని వ్యాఖ్యానించారు. న్యాయమైన సమాజాన్ని చూడాలనుకునే వ్యక్తులను ఏకతాటిపైకి తీసుకువస్తున్నా యని కార్బిన్ పేర్కొన్నారు. లేబర్ పార్టీ నాయకుడు, మానవ హక్కుల మాజీ న్యాయవాది సర్ కైర్ స్టార్మర్ మాట్లాడుతూ గాజాకు వైద్య సహాయం అందకుండా దిగ్బంధించేందుకు మద్దతు ఇచ్చినందుకు సిగ్గుతో తల దించుకోవాలని ఆవేదన వ్యక్తంచేశారు.

పోలవరంపై కేంద్రానికి చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చు భరించేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ రాష్ట్ర హైకోర్టులో కాంగ్రెస్ మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు పిటిషన్ దాఖలు చేశారు. కేవీపీ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ సుప్రీంకోర్టును కేంద్ర ప్రభుత్వం 2019లో ఆశ్రయించింది. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. పిటిషన్‌ను ఏపీ హైకోర్టు నుంచి బదిలీ చేయాలంటూ కేంద్రం తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. దీనికి సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన కేసులో ఏపీ హైకోర్టుకే వెళ్లాలని, అక్కడే కేంద్రం తన వాదనలు వినిపించుకోవాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

హామీ తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వమే ఆలోచించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ఒకవేళ ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోతే తానే విచారిస్తానని చెప్పడంతో ప్రభుత్వ న్యాయవాది అందుకు అంగీకారం తెలిపారు. ఈలోపు కార్యాలయాలు తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అందువల్ల మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది ఉన్నం మురళీధర్ హైకోర్టుని కోరారు. కార్యాలయాల తరలింపుపై ఇప్పటికిప్పుడు ఏమీ జరగదని, అది సుదీర్ఘ ప్రక్రియ అని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం ఇలా చెపుతూనే కార్యాలయాలు తరలించేందుకు అంతర్గత ఏర్పాట్లు చేస్తోందని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. దీంతో ప్రభుత్వం వైపు నుంచి రాజధానిని తరలించకుండా ఆదేశాలు తీసుకోవాలని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

నారాయణ బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి అసైన్డ్ భూముల కొనుగోలు కేసులో మాజీమంత్రి నారాయణ, ఇతరులు దాఖలు చేసిన ముందస్తు బెయిల్, క్వాష్ పిటిషన్లపై సీఐడీ అభ్యర్థన మేరకు తదుపరి విచారణను వచ్చే వారానికి న్యాయస్థానం వాయిదా వేసింది. తన భర్తను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి సతీమణి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. అరెస్టు సమయంలో తీసిన ఫొటోలను పోలీసులు కోర్టుకు అందించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించిన సీసీ ఫుటేజీని పిటిషనర్ తరపు న్యాయవాది వీవీ సతీశ్...కోర్టుకు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత కేసు విచారణ చేస్తామని కోర్టు తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టారంటూ బండారు సత్యనారాయణమూర్తిపై పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు.

ప్రజాప్రతినిధులపై కేసు 27కి వాయిదా

ప్రజాప్రతినిధులపై పెండింగ్ కేసుల అంశంపై నమోదు చేసిన సుమోటో పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. మొత్తం ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు ఇవ్వాలని విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ప్రజాప్రతినిధులపై పెండింగ్ కేసుల్లో జాప్యాన్ని తగ్గించేందుకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి హైకోర్టు పర్యవేక్షణ చేయాలని సుప్రీంకోర్టు గతంలో హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరిపింది.

సుప్రీంకు మహువా

న్యూఢిల్లీ: తన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడంపై తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆమె సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలు లేకుండా...వచ్చిన ఆరోపణలపై సరైన దర్యాప్తు చేయకుండా తనపై చర్యలు తీసుకున్నారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టును కోరారు. డబ్బులు తీసుకొని అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై పార్లమెంటు నైతిక విలువల కమిటీ విచారణ జరిపింది. మహువా మొయిత్రాపై ఆరోపణలు నిజమేనని కమిటీ తేల్చింది. దీనికి సంబంధించిన నివేదికను కమిటీ లోక్‌సభకు సమర్పించింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య స్వల్పకాలిక చర్చ అనంతరం మహువాను బహిస్కరిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఆమె పశ్చిమబెంగాల్‌లోని కృష్ణానగర్ ఎంపీగా పనిచేశారు. కాగా, తన బహిష్కరణపై తీవ్రంగా స్పందించిన మహువా...ఇది రాజ్యాంగ వ్యతిరేకమని మండిపడ్డారు. మహువాకు ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు అండగా నిలిచారు. న్యాయనిపుణుల సలహా మేరకు తన లోక్‌సభ సభ్యత్వం రద్దుపై ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఎంపీ సీఎం మోహన్ యాదవ్

భోపాల్: ఎట్టకేలకు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిని బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. రాజస్థాన్ సీఎం అభ్యర్థిపై ఇంకా తర్జనభర్జన పడుతోంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవులు కొత్త ముఖాలకు కట్టబెట్టడంతో రాజస్థాన్‌లోనూ ఇదే పరిస్థితి తలెత్తవచ్చని భావిస్తున్నారు. అలాగైతే వసుంధర రాజె సింధియా నుంచి బీజేపీకి ముప్పు తప్పదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు సోమవారం తెరపడింది. సీఎం ఎంపికలో బీజేపీ అధిష్ఠానం ఊహించని నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రిగా పార్టీ నేత, ఉజ్జయిని ఎమ్మెల్యే మోహన్ యాదవ్‌ను ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయనను పార్టీ శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జగన్‌కు భారీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

లేకపోవడంతో ఓఎస్డీకి ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలతోనే ఎమ్మెల్యే పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. త్వరలో కారణాలు వివరిస్తానని ముక్తసరిగా చెప్పారు. దీంతోపాటు గాజువాక ఎమ్మెల్యే తనయుడు దేవన్‌రెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. దేవన్‌రెడ్డి గాజువాక వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామాతో వైసీపీ వర్గాల్లో ఆందోళన ప్రారంభమైంది. దాదాపు ఏడాది నుంచి ఆర్కే తన నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేయడం లేదు. ఆర్కే ఎమ్మెల్యేగా ఉండగానే, ఆయన ప్రమేయం లేకుండా బీసీ వర్గానికి చెందిన గంజి చిరంజీవిని వైసీపీలో చేర్చుకున్నారు. అదే నియోజకవర్గానికి చెందిన మాజీమంత్రి మురుగుడు హనుమంతరావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఇలా నియోజకవర్గంలో ఆర్కేకు తెలియకుండా ఆయనకు వ్యతిరేకంగా ఉన్న వారంతా పార్టీలో క్రియాశీలకంగా మారడంతో ఆర్‌కే అసంతృప్తికి గురయ్యారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఆర్కే రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో అతి స్వల్ప మెజార్టీతో గెలుపొందిన ఆర్‌కే...2019 ఎన్నికల్లో టీడీపీ నేత నారా లోకేశ్‌పై ఐదు వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. తనకు మంత్రి పదవి వస్తుందని ఆశించిన ఆర్‌కే చివరికి భంగపాటుకు గురయ్యారు. ఆ తర్వాత రెండో విడత మంత్రివర్గ విస్తరణలోనూ ఆయనకు చోటుదక్కలేదు. అప్పటి నుంచి ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. వైసీపీ, ప్రభుత్వ పక్షాన నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రాబోయే ఎన్నికల్లో సర్వే ఆధారంగా గెలిచే వారికే టికెట్లు కేటాయించాలని వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ భావించారు. అందులో భాగంగా నియోజకవర్గాల వారీగా ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దాదాపు 30 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికల్లో మంగళగిరి నుంచి ఆర్కేకు టికెట్ లేదని సీఎం జగన్ తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో ఇంతకాలం ఓర్పుగా ఉన్న ఆర్కే ఒక్కసారిగా తన పదవికి, పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయాంశమైంది. రాజధాని భూముల అంశంపైన, టీడీపీ నేతలపై అనేక కేసులను న్యాయస్థానాల్లో వేశారు. పార్టీకి విధేయుడిగా ఉండి, సీఎం జగన్ సొంత మనిషిలా ఉన్న ఆర్కే రాజీనామా చేయడం, త్వరలో పూర్తి వివరాల్ని ప్రకటిస్తానని చెప్పడంతో వైసీపీ వర్గాల్లో ఆందోళన మొదలైంది. మంగళగిరి నియోజకవర్గ సీటును బీసీ సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవికి ఇవ్వాలని వైసీపీ అధిష్ఠానం నిర్ణయించింది. మంగళగిరి కాకుండా ఇతర నియోజకవర్గాల్లోనూ ఆర్కేకు టికెట్ ఇచ్చే అవకాశం లేదని సమాచారం. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయన రాజీనామా చేసినట్లు తెలిసింది.

ఆర్కే రాజీనామాతో వైసీపీకి నెగిటివ్ సిగ్నల్

అధికార పార్టీ ఎమ్మెల్యే ఆర్కే రాజీనామాతో వైసీపీకి ప్రతికూల సంకేతాలు ప్రారంభమైనట్లు రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు. ఇదే విషయాన్ని వైసీపీలోని పార్టీ సీనియర్లు సమర్థిస్తున్నారు. టికెట్ల విషయంలో ఏదైనా అసంతృప్తి ఉంటే అధినేత దగ్గరికి వెళ్లి మాట్లాడలేక రాజీనామా చేయడం పార్టీ వ్యతిరేక సంకేతాలు ఇచ్చినట్లేనని చెబుతున్నారు. టికెట్లు దక్కని వారందరితో జగన్ భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తామని జగన్ ఇస్తున్న భరోసాతో ఎమ్మెల్యేలు ఎంతవరకు సంతృప్తి పడతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఆర్కే బాటలో మరికొందరు నడుస్తున్నారు. గాజువాక నియోజవర్గ వైసీపీ ఇన్చార్జ్ దేవన్ రెడ్డి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే ఆర్కే రాజీనామాతో ఆయన అనుచరులూ రాజీనామా చేశారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, తాడేపల్లి రూరల్ మండల నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, ఈదులమూడి డేవిడ్‌రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకటరామిరెడ్డి తమ పార్టీ పదవులకు రాజీనామా చేశారు.

జాతి హననం దిశగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం

పలస్తీనా స్వేచ్ఛ కోసం పుస్తకావిష్కరణలో వక్తలు

విశాలాంధ్ర - తిరుపతి: పలస్తీనాలో జాతి హననం దిశగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ అన్నారు. నాగరిక సమాజంలో ఇజ్రాయిల్ చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. తిరుపతి లోని సీపీఐ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక సదస్సులో పలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం అంశంపై సంకలన పుస్తకాన్ని రాఘవ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా చిత్రీకరించడం దారుణమని అన్నారు. తమ మాతృ భూమి కోసం, మనుగడ కోసం హమాస్ పోరాటం చేస్తోందన్నారు.ప్రతి ఒక్కరూ చరిత్రను అధ్యయనం చేయాలని కోరారు. మన దేశంలో కూడా జాతి విభజనకు పాలకులు ప్రయత్నాలు చేస్తుండటం దారుణమని అన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ పలస్తీనా లో వందేళ్ల క్రితం భూమి లేని యూదులు ఇప్పుడు మూడింట రెండు వంతుల భూమిని ఆక్రమించిన తీరును యువత అధ్యయనం చేయాలని కోరారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం బ్రిటన్ చర్యలు ఇజ్రాయిల్ దేశానికి అంకురార్పణ జరిగిందని వివరించారు. అనంతరం సామ్రాజ్య వాద శక్తుల అండతో ఇజ్రాయిల్ ఏడు దశాబ్దాలుగా దేశవిస్తరణ చర్యలకు పాల్పడుతోందని అన్నారు. దీంతో పలస్తీనా ప్రజలను స్వదేశంలోనే ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లలేని స్థితికి నెట్టి వేశారని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ, నెహ్రూ సైతం పలస్తీనాకు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. పలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం పుస్తకం లోని వ్యాసాలను చదివితే ఇజ్రాయిల్ అకృత్యాలు తెలుస్తాయని వివరించారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ నరమేధాన్ని ఖండించకపోతే భవిష్యత్తులో మనకు అదే పరిస్థితి ఎదురౌతుందని హెచ్చరించారు. మన పాలకులు సైతం మతం, కులం పేరుతో విభజన చేసే చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత సమకాలీన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రమణ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ గురవయ్య, కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, కోశాధికారి రేణుకా దేవి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి, కార్యవర్గ సభ్యులు పెంచలయ్య, రాధాకృష్ణ, కుమార్ రెడ్డి, విశ్వనాథ్, అరసం రాష్ట్ర కార్యదర్శి సాకం నాగరాజు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వర్సిటీ భూములకు రక్షణగా నిలుద్దాం

(మొదటిపేజీ తరువాయి)

జగనన్న కాలనీ పేరుతో ఆక్రమణకు కుట్ర జరిగింది. ఆ భూమిని ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో రామకృష్ణ సోమవారం పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ మేధావులను తీర్చిదిద్దిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం భూ కబ్జాకు గురవుతున్నా...అధికారులు, ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టుకున్న పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. పేదలకు భూమి ఇవ్వాలంటే బయట కొనుగోలు చేయాలని, విశ్వవిద్యాలయాల భూములు ఆక్రమించుకునే చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భూములకు రక్షణగా ఉండాల్సిన వైస్ చాన్సలర్ రామకృష్ణారెడ్డి పదవీ విరమణకు రెండు రోజుల ముందు జగనన్న లేఔట్లకు అనుమతులు ఇవ్వడం ఆయన నిజాయతీకి, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందని విమర్శించారు. ఆరు నెలల క్రితం పాలకమండలి సభ్యులు దీనిని తిరస్కరించారని అన్నారు. వైసీపీపై ప్రేమ ఉంటే వైస్‌చాన్సలర్ పదవికి రాజీనామా చేసి.. ఆ పార్టీ కండువా కప్పుకోవాలని హితవు పలికారు. అనుమతి లేకుండా కంచె ఏర్పాటు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయాలు వైసీపీ నేతలకు నిలయాలుగా మారడం బాధాకరమన్నారు.

నిరంతరం కళకళలాడే విశ్వవిద్యాలయం నేడు కనుచూపు మీరు చూసిన విద్యార్థులు లేక బోసిపోతోందని, దీనికి వైసీపీ ప్రభుత్వం, రామకృష్ణారెడ్డి కారణమన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలకు సంబంధించిన భూ ఆక్రమణలపై గవర్నరుకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయాలను రక్షించుకుందాం.. కదలిరండి...సమాజ అభ్యున్నతికి ... జ్ఞాన వెలుగులు అందించిన విశ్వవిద్యాలయాల భూముల ఆక్రమణను అడ్డుకునేందుకు మేధావులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ముందుకు రావాలని, విశ్వవిద్యాలయాల ప్రగతికి చేయూత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం మాజీ నాయకుడు నారాయణస్వామి, మల్లికార్జున, రామకృష్ణ, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి కుల్లాయిస్వామి, కుళ్లాయప్ప, అంకన్న, నరేశ్, మహేశ్, వంశీ, మంజు, రారాజు, శ్యామల్, పవన్, అశోక్, సోమ, హర్ష పాల్గొన్నారు.

ఆత్మహత్యలు పరిష్కారం కాదు: రామకృష్ణ

విశాలాంధ్ర- అనంతపురం వైద్యం: ఆత్యహత్యలు సమస్యలకు పరిష్కారం కాదని, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటుతోనే సమస్య పరిష్కారమవుతుందని రామకృష్ణ పేర్కొన్నారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోయ మల్లేశ్‌ను రామకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చిందని, తర్వాత మాటతప్పి ప్రభుత్వఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్రంగా మోసం చేసిన సంగతి తెలిసిందేనన్నారు. సీపీఎస్ రద్దు చేయలేదన్న మనస్థాపంతో అతిచిన్న వయసులోనే బోయ మల్లేశ్ ఆత్మహత్యాయత్నం బాధాకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ వ్యతిరేక ఓటుతో గజన్‌ను ఇదుపులపాయకు పరిమితం చేయాలని పిలుపునిచ్చారు. రామకృష్ణ వెంట సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు సి.నారాయణస్వామి, నగరకార్యదర్శి ఎస్.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో రూ.6865 కోట్లతో స్మార్ట్ సిటీ పనులు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన మిగిలిన 5 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అభివృద్ధి పనులు కోసం 966 కోట్లు విడుదల చేయగా 838.47 కోట్లు ఖర్చు చేశారు. అమరావతిలో 930 కోట్లతో చేపట్టిన 19 ప్రాజెక్టులకు 627.14 కోట్లతో 12 ప్రాజెక్టులు పూర్తి చేయగా 302.86 కోట్లతో చేపట్టిన మిగిలిన 7 ప్రాజెక్టులు వేర్వేరు దశల్లో ఉన్నాయి. అభివృద్ధి పనుల కోసం 1,016కోట్లు విడుదల చేయగా 779.29 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్‌ను 2015 జూన్ 25న ప్రారంభించి ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు ప్రధాన నగరాలతో సహా దేశంలో 100 నగరాలను ఎంపిక చేసిందని మంత్రి తెలిపారు.

370వ అధికరణానికి సంపూర్ణ సమాధి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునే ప్రతి చర్యనూ సవాలు చేయకూడదని సీజేఐ అభిప్రాయపడ్డారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి కేంద్రానికి రాష్ట్రం అనుమతి అవసరం లేదని జస్టిస్ చంద్రచూడ్ కీలక వ్యాఖ్య చేశారు. జమ్మూ-కశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. 1947లో ఏర్పడిన భారత యూనియన్‌లో విలీనం చేస్తూ జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని 370 అధికరణ కల్పించింది. దీనివల్ల వివిధ రాజ్యాంగ పథకాలు వర్తిస్తాయి. అయితే, వీటన్నింటినీ రద్దుచేయడాన్ని సమర్థిస్తూ మూడు ఏకరూప నిర్ణయాలతో కూడిన తీర్పును జస్టిస్ చంద్రచూడ్ వెలువరించారు. రాజ్యాంగ ధర్మాసనం మూడు తీర్పులు వెల్లడించింది. ఇందులో జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ ఒక తీర్పును, జస్టిస్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా వేర్వేరుగా రెండు తీర్పులు వెలువరించారు. ఈ మూడు తీర్పులూ 370 అధికరణ రద్దును సమర్థిస్తూ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. దీంతో రాజ్యాంగ ధర్మాసనం సంపూర్ణంగా ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లయింది. 2019 ఆగస్టు 5వ తేదీన జమ్ముకశ్మీర్ నుంచి లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయం చెల్లుబాటును సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. అంతేగాకుండా, అదే రోజు కేంద్ర ప్రభుత్వం 370 అధికరణను రద్దు చేయడంతోపాటు జమ్మూ-కశ్మీర్, లడఖ్‌ల పేర్లతో రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను విభజించింది.

ప్రశ్నలు ప్రశ్నలుగానే మిగిలాయి: రాజా

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దుని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఎన్నో అంశాలు ఇంకా ప్రశ్నార్థకంగానే మిగిలిపోయాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. ఇది తమ ప్రాథమిక స్పందన మాత్రమేనని పేర్కొన్నారు. తీర్పును అధ్యయనం చేసిన తర్వాత దీనిపై సవివరంగా స్పందిస్తామని అన్నారు. కొట్టాయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ తీర్పును కూలంకషంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఇప్పటికిప్పుడు దీనిపై ఒక నిర్ణయానికి రాలేమని చెప్పారు. 'అధికరణ 370ని రద్దు చేసినప్పుడు, జమ్మూ-కశ్మీర్ నుంచి రాష్ట్ర హోదాను లాక్కున్నట్లే. రాష్ట్రం ముక్కలైంది. రాష్ట్రపతి అధికారాలేమిటి? కేంద్ర ప్రభుత్వ అధికారాలేమిటి? రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికైన ప్రభుత్వాల అధికారాలేమిటి? ఇలాంటి ప్రశ్నలన్నింటికీ ఇంకా సమాధానాలు రాలేదు' అని రాజా అన్నారు. జమ్మూ-కశ్మీర్‌కు చెందిన ఏ ఒక్క రాజకీయ పార్టీని గానీ, దానికి సంబంధించిన వ్యక్తులతోగానీ, కశ్మీర్ ప్రజలతోగానీ ఒక్క మాట కూడా సంప్రదించకుండానే ఆర్టికల్ 370ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది అధికారబలంతో చేసిన పనిగా కన్పించిందని రాజా వ్యాఖ్యానించారు.

భారత యూనియన్‌లో చేరినప్పుడు జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమత్వం లేదని, భారత రాజ్యాంగంలోని ప్రతి నిబంధనను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి అవసరం లేదని జస్టిస్ చంద్రచూడ్ స్పష్టంచేశారు. 'ఆర్టికల్ 370 తాత్కాలిక నిబంధన. రాష్ట్రంలో యుద్ధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. జమ్మూ-కశ్మీర్ కూడా అన్ని రాష్ట్రాల లాంటిదే. ఇతర రాష్ట్రాలకు విభిన్నంగా అంతర్గత సార్వభౌమాధికారం లేదు. ఈ మేరకు రాజ్యాంగంలో కూడా ప్రస్తావన లేదు. లడఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా పునర్‌వ్యవస్థీకరించడం సమర్థనీయం. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా? లేదా? అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఆ పని కేంద్రం చేసుకుంటుంది. ఆర్టికల్ 370 రద్దు సరైనదే. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు సమర్థనీయమే. ఆర్టికల్ 370 ముఖ్య ఉద్దేశం జమ్మూ-కశ్మీర్‌ను నెమ్మదిగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా తీసుకురావడమే. డొంక దారిలో నిబంధనల సవరణ సరికాదు. ఒక విధానాన్ని సూచించినప్పుడు దానిని తప్పకుండా అనుసరించాలి" అని సీజేఐ పేర్కొన్నారు. ఆర్టికల్ 367 ఉపయోగించి ఆర్టికల్ 370 సవరణ ప్రక్రియ చేపట్టడంపై జస్టిస్ కౌల్ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం 'నిష్పాక్షిక నిజం, సయోధ్య కమిటీ'ని ఏర్పాటు చేయాలని, ఈ అంశంతో ముడిపడి ఉన్న సున్నితమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని జస్టిస్ కౌల్ సిఫార్సు చేశారు. జమ్మూ-కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సమర్థిస్తూనే సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన తరుణంలో అక్కడ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ధర్మాసనం ఈసీని ఆదేశించింది. కశ్మీర్ రాష్ట్ర హోదాను త్వరగా పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించింది. 2024 సెప్టెంబర్ 30కల్లా ఎన్నికలు పూర్తిచేయాలని స్పష్టం చేసింది.

తీర్పు నేపథ్యంలో కశ్మీర్ అంతటా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. తీర్పును రాజకీయం చేయవద్దంటూ బీజేపీ కోరింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించబోమని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ కూటమిగా జమ్మూ-కశ్మీర్ పార్టీలు ఏర్పడ్డాయి. గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ఏడాది ఆగస్ట్ 2 నుంచి ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేస్తూ పార్లమెంట్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన జమ్మూ-కశ్మీర్ రాజకీయ పార్టీలు సుప్రీంను ఆశ్రయించాయి.

సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం: మోదీ

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దుని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. జమ్మూ-కశ్మీర్, లడఖ్ ప్రజల ఐక్యత, పురోగమనం, దృఢవిశ్వాసం కోసం సుప్రీంకోర్టు సుస్పష్టమైన ప్రకటన చేసిందని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన కొద్దిసేపటికే 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. 'ఆర్టికల్ 370 రద్దుపై ఈ రోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనది. 5 ఆగస్టు 2019న భారత పార్లమెంట్ తీసుకున్న నిర్ణయాన్ని సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దృఢమైన విశ్వాసం కలిగిన జమ్మూ, కశ్మీర్, లడఖ్ ప్రజల కలలను సాకారానికి కట్టుబడి ఉన్నామని మోదీ హామీ ఇచ్చారు. ప్రగతి ఫలాలను సాధారణ ప్రజలతోపాటు సమాజంలో అత్యంత బలహీన, అట్టడుగు వర్గాలకు అందజేస్తామన్నారు. ఆర్టికల్ 370 కారణంగా నష్టపోయిన సమాజానికి అభివృద్ధి ఫలాలను అందజేస్తామని తెలిపారు. ఈ తీర్పు కేవలం చట్టపరమైన తీర్పు కాదని, ఇదొక ఒక ఆశాకిరణంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఉజ్వల భవిష్యత్తుకు వాగ్దానమని, ఉమ్మడి భారతదేశాన్ని నిర్మించాలనే సమష్టి సంకల్పానికి నిదర్శనమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్రంలో మిచౌంగ్ తుపానుతో నష్టపోయిన రైతులను, కరువు ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న రైతులను, రైతు కూలీలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వారికి తగిన నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో 16 జిల్లాల్లో తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఆ ప్రాంతాల్లో ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, పూర్తిగా పంటలు నష్టపోయిన వరి రైతులకు రూ.40 వేలు, వాణిజ్య పంటలు రైతులకు రూ.70 వేలు, ఉద్యానవన పంటల రైతులకు లక్ష రూపాయలు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఒకపక్క వర్షాభావ పరిస్థితులతో కరువు, మరోవైపు తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయి అల్లాడుతున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతుల గోడును పట్టించుకునే స్థితిలో లేరని అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి క్రికెట్ స్టేడియంలో ఆటను చూసినట్టు చూసి వెళ్లారని ఎద్దేవా చేశారు. కరువు మండలాలను ప్రకటించటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో తుపాను, కరువు పరిస్థితులను చూస్తూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందని... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ సమావేశంలో పల్నాడు జిల్లా సీపీఐ నాయకులు విజయ్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీపీఎం రైతు సంఘం నాయకులు రామారావు, టీడీపీ రైతు సంఘం నాయకులు గూడూరు శేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఉలవపూడి రాము, తాళ్లూరి బాబురావు, జనసేన పార్టీ నాయకులు అదృష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వెన్ను విరుస్తున్న జగన్: అక్కినేని వనజ

విశాలాంధ్ర-రాజమండ్రి: రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి వెన్నెముకైన రైతులను కష్టాల్లో ఆదుకోకుండా వారి వెన్ను విరుస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. మిచౌంగ్ తుపానుతో తీవ్రంగా నష్ట పోయిన రైతులకు సహాయం చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 13న రాజమండ్రి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా అఖిలపక్ష పార్టీలు, రైతు సంఘాల అధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాల యంలో తుపానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతూ రౌండ్ టేబుల్ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి టీడీపీ నుంచి ఆదిరెడ్డి అప్పారావు, రెడ్డి మణి, కాశీ నవీన్,కుమార్ కాంగ్రెస్ పార్టీ నుండి బాలేపల్లి మురళీధర్, ఐ ఏ ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ల సుబ్బారావు, సీపీఎం నుంచి బి పవన్, న్యూ డెమొక్రసీ పార్టీ నుండి చీకట్ల వెంకటేశ్వరరావు, కే జోజి, బీఎస్పీ నుంచి రఘు ప్రసాద్, రైతు సంఘాల నుండి పీ నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. తొలుత అక్కినేని వనజ మాట్లాడుతూ తుపాను తీవ్రతపై ముందస్తు హెచ్చరికలున్నా రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిం దన్నారు. 20 లక్షల ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లిందని, ఇళ్లు కూలడంతో పాటు వేలాదిగా విద్యుత్ స్తంభాలు పడిపోయి వందలాది గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిం దన్నారు. ఇంత జరుగుతున్న సీఎం జగన్.. సాయం కోసం కేంద్రాన్ని డిమాండ్ చేయడం గాని, ప్రభుత్వం తరపున తుపాను బాధితులను ఆదుకోవడం చేయడం లేదన్నారు. ఈ ముఖ్యమంత్రి రైతుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని ఆమె పిలుపునిచ్చారు. ఇప్పటికే సీపీఐ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 14వ తేదీన అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నామని, కారణాల వల్ల 13న తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్నామని దీనికి రైతులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆదిరెడ్డి అప్పారావు , బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ నష్టపోయిన అన్ని పంటలకు పంటల బీమా వర్తింప చేయాలన్నారు. ముప్పాళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ రైతులు పెద్ద ఎత్తున పోరాడితే గాని ఈ ప్రభుత్వానికి బుద్ధిరాదన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వీ కొండలరావు, జట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చింతలపూడి సునీల్, తోట లక్ష్మణ్, కే శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నగర్ కన్వీనర్ ఎం స్టాలిన్, టీడీపీ నాయకులు సంసాని ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : మిచౌంగ్ తుపాను ధాటికి నేల వాలి... నీట మునిగిన వరి పైరు ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలని నల్లమడ రైతుసంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం తుపాను, కరువుతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధ్యక్షతన జరిగింది. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్ స్వాగతం పలకగా ముఖ్యఅతిథి డాక్టర్ రాజమోహన్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో బాపట్ల పరిధిలోని కంకటపాలెం జమ్ములపాలెం నరసాయ పాలెం పర్చూరు పరిదిలోని చెరుకూరు, కారంచేడు, కుంకలమర్రు పరిసర ప్రాంతాలలో పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. డ్రైన్‌లు సక్రమంగా లేకపోవడంతో పంటలు సక్రమంగా పండక తరచూ ఆహార ఆర్థిక సంక్షోభాలు ఏర్పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో అతివృష్టి లేదా అనావృష్టి పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ పరిస్థితులన్నీ సక్ర మంగా ఉండాలంటే ప్రభుత్వాలు పూనుకొని నష్ట పోయిన రైతులకు నష్టపరిహారాలను చెల్లించాలని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని కోరారు.

కేంద్రం రూ.వెయ్యికోట్లు ఆర్థిక సాయం ప్రకటించాలి: జల్లి విల్సన్

మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్ మాట్లాడుతూ తుపాను వల్ల రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకు పైగా అపార పంటనష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం 1.47 లక్షల హెక్టార్లలో మాత్రమే పంట నష్టం అంచనా వేయటం సరికాదన్నారు. మిర్చి, పత్తి, మొక్కజొన్న, మినుము, కూరగాయలు తదితర పంటలన్నీ ధ్వంసం అయ్యాయన్నారు. రాష్ట్రంలోని కరువు, తుపాను నష్టాన్ని కేంద్రం ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించాలన్నారు. రూ.1000 కోట్ల తక్షణ సాయాన్ని ప్రకటించాలని కోరారు. కౌలుకు తీసుకుని సాగు చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం నష్ట పరిహారం నేరుగా ఇవ్వాలన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని, పత్తి, మిర్చి పంటలను ఎటువంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. రౌండ్ టేబుల్ సమావేశంలో చేతి వృత్తుల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు శీలం వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ వెల్ఫేర్ అసోషియేన్ రాష్ట్ర నాయకులు పఠైౖ కోటయ్య, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ జీ రాజారావు, సీపీఎం నాయకుడు కోటేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు రెడ్డి శాంతారాం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్, షేక్ కాలేషా ఖాదార్ బాషా, చీరాల సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ జే రత్నకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు త్రిపుర కృష్ణారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు పొదిలి శ్రీమన్నారాయణ,షేక్ సుభాని, పొట్లూరి రామాంజమ్మ, చీదర్ల కొండయ్య, సన్నమూరి శ్రీనివాసరావు, కోలా వీరాజంనేయులు, మల్లవరపు రమణ, దుర్గాప్రసాద్, శివ, మెగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రైతులను ఆదుకునే ఆలోచనే లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీశ్

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయారని.. వీరిని ఆదుకునే ఆలోచన కూడా సీఎం జగన్ మోహన్ రెడ్డి చేయడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ మండి పడ్డారు. సోమవారం అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో తుపాను, కరువు నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆపార్టీ జిల్లా సమితి అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిన్నప్ప యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జగదీశ్ సహా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జయరామ్ రెడ్డి, ఏఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా 49 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. తీవ్ర కరువు నేపథ్యంలో 20 లక్షల ఎకరాల్లో అప్పటికే విత్తనం వేయకుండా క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. తుపాను ప్రభావంతో 20 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు, వాణిజ్య, ఆహార పంటల్ని రైతులు కోల్పోయారన్నారు. కరువు పరిస్థితులు, తుపాను దెబ్బకు అతలాకుతల మవుతున్న రైతులను ఆదుకోవాలని జగదీశ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నా కూడా సీఎం జగన్ కరువు మండలాల్లో పర్యటించి వారికి ఆత్మ విశ్వాసాన్ని కల్పించిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ నెల 14 న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద సీపీఐ అధ్వర్యంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతుల రుణాలన్నింటినీ ప్రభుత్వం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జాఫర్ మాట్లాడుతూ... కరువు నేపథ్యంలో రాష్ట్ర మంతా దయనీయ పరిస్థితి ఉందని, ఎక్కడా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు తిరిగిన దాఖలాలు లేవని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రైతులకిచ్చే రైతు భరోసా 13 వేల రూపాయలను తానే ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నాడని సీఎం జగన్ పై మండి పడ్డారు. సీఎం జగన్ కు సలహాలిచ్చే వారే ఎక్కువగా ఉన్నారని వాళ్లందరికీ లక్షల రూపాయల ప్రజా ధనం వేతనంగా ఖర్చు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తపాను, కరువు లతో నష్టపోయిన రైతులకు మేలు చేసే విషయాన్ని ఆలోచించకుండా సీఎం జగన్... ఎన్నికల్లో లబ్ధి ఏవిధంగా పొందాలనే ఎత్తుగడలతో ఉన్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, శ్రీరాములు,నారాయణ స్వామి, రమణ,సంతోష్ కుమార్, రాజేష్ గౌడ్, కుల్లాయ్ స్వామి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి, పండ్ల తోటల రైతుల సంఘం అధ్యక్షుడు మురళీ, పేదల సంఘం అధ్యక్షుడు వీర నారప్ప, రైతు సంఘం నాయకులు నాగరాజు, పెద్దయ్య, రమేష్, ధనుంజయ, నీళ్ళపాల రామకృష్ణ, వన్నారెడ్డి, వెంకట రాముడు, రాము సీపీఐ నాయకులు అల్లిపీర, చాంద్ బాష, మర్రి స్వామి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

సీఐపై దాడి దుండగులను కఠినంగా శిక్షించాలి

ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటి విజిలెన్స్ సీఐ అనిల్ కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జీ ఈశ్వరయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకు శాంతి భద్రతలు దిగజారుతున్నాయని చివరకు పోలీస్ అధికారులపైనే దాడులు చేయడానికి వైసీపీ గూండాలు బరి తెగించడం దారుణమన్నారు. అసాంఘిక, అరాచక శక్తులు, భూకబ్జా కోరులు, ఇసుక మాఫియా, భూ మాఫియా, గూండాయిజం, అక్రమ ఇసుక రవాణా, భూ మాఫియాను అరికట్టడంలో అధికారులు వైసీపీ నాయకులకు భయపడి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. సీఐ అనిల్ కుమార్ పై దాడి చేసి రెండు రోజులు అవుతున్నా... కడప పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పోలీసు వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన స్వలాభం కోసం ఉపయోగించుకుంటున్నారని , రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నించిన పార్టీల నాయకులపై అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలు పాలు చేయడానికి పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు రాజ్యాంగబద్ధంగా పనిచస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఐపై దాడి చేసి గాయపరిచిన వైసీపీ గుండాలపై పోలీసు కేసులు నమోదు చేసి అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలో నిజాయితీగా పని చేస్తున్న పోలీస్ అధికారులకు ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

పేదలకు లాయర్లు అండగా నిలవాలి

నాలుగున్నరేళ్లలో రూ.49.51 కోట్లు ఆర్థిక సాయం

లానేస్తం కింద 2807 మందికి 8 కోట్లు జమ చేసిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: న్యాయ వాదులు పేదలకు అండగా నిలబడాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. కోవిడ్ సమయంలోనూ యువ లాయర్లకు ప్రభుత్వం అండగా నిలిచిందని, నాలుగేళ్లుగా యువ లాయర్లకు అండగా ఉంటున్నామని చెప్పారు. వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఇప్పటివరకు 6069 మంది న్యాయవాదులకు మేలు చేశామని, నాలుగున్నరేళ్లలో రూ.49.51 కోట్లు అందించా మన్నారు. ఇదిగాక రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో జూనియర్ న్యాయవాదులకు అండగా ఉంటున్న రాష్ట్ర ప్రభుత్వం 2023-24 సంవత్స రానికి సంబంధించి రెండో విడత వైఎస్సార్ లా నేస్తం నిధులను ముఖ్యమంత్రి సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5,000 స్టైఫండ్ చొప్పున ఈ ఏడాది జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరునెలలకు గాను ఒక్కొక్కరికి రూ.30 వేల వంతున మొత్తం రూ.8 కోట్లను వారి ఖాతాల్లో జమచేశారు. కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువ లాయర్లు వృత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్లపాటు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.60 వేల చొప్పున మూడేళ్లకు మొత్తం రూ.1.80 లక్షలు ఇస్తోంది. ఏడాదికి రెండుసార్లు నిధులు వారి ఖాతాల్లో జమచేస్తున్నామని వివరించారు. న్యాయవాదుల సంక్షేమం కోసం అడ్వకేట్ జనరల్ అధ్వర్యంలో న్యాయ, ఆర్థికశాఖ సెక్రటరీలు సభ్యులుగా రూ.100 కోట్లతో అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేశామన్నారు. న్యాయవాదుల అవసరాలకు రుణాలు, గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీలు, ఇతర అవసరాల కోసం ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికే రూ.25 కోట్ల ఆర్థికసాయం అందించామన్నారు. వైఎస్సార్ లా నేస్తం పథకానికి సంబంధించి ఏ రకమైన ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం ద్వారా 1902 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించ వచ్చునన్నారు. కార్యక్రమంలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, లా సెక్రటరీ జి.సత్యప్రభాకరరావు, ఇతర అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జీతాలిస్తారా... సమ్మెలోకి వెళ్లమంటారా ?: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్లు, డీటీపీ ఆపరేటర్లు, అందరికీ తక్షణమే జీతాలు చెల్లించాలని, లేకుంటే ఈ నెల 20వ తేదీ నుంచి తలపెట్టిన సమ్మెలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యకర్తలు, నాయకులు, ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొనాల్సి వస్తుందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం అమరావతిలోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావును కలిసి సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాలపై చర్చించారు. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేసే వాళ్లంతా చిరు ఉద్యోగులనీ, అవి కూడా మూడు నెలలుగా పెండింగ్‌లో పెట్టడం భావ్యం కాదని విమర్శించారు. సమగ్ర శిక్ష అభియాన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి ప్రకారం నిధులతో నడిచే కార్యక్రమాన్ని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 750 కోట్లు ఇతర కార్యక్రమాలకు దారి మళ్లించి, వారి జీతాలు పెండింగ్ పెట్టడం అత్యంత అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని, ఈనెల 20వ తేదీ లోపు జీతాలు చెల్లించకపోతే సమ్మెలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని, అదే జరిగితే ఉపాధ్యాయ సంఘాలుగా ఉపాధ్యాయులుగా వారికి మద్దతిచ్చి సమ్మెలో పాల్గొనడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఎస్ పి డీ ని కలిసిన వారిలో ఎస్టీయూ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పికా ఇమ్మానియేల్ కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు: కత్తి నరసింహా రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షనర్ల సమస్యల సాధనకు ఆత్మహత్య పరిష్కారం కాదని, సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుదామని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి సోమవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఉపాధ్యాయుడు మల్లేశ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎన్నికల ముందు సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ ఇస్తామని, మెరుగైన పీఆర్సీ, సకాలంలో డీఏలు చెల్లిస్తామని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేస్తామని, బకాయిలు ఉండవని ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉంటుందని లాంటి ఎన్నో హామీలను జగన్ ఇచ్చారని గుర్తుచేశారు. ఇందులో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాక పోగా, సకాలంలో జీతాలు, పెన్షన్లు చెల్లించాలని కోరుతూ రోడ్ల మీదకు వచ్చే స్థితిని, ఆత్మహత్యలు చేసుకోవాలన్న పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఉద్యోగులు తగిన బుద్ధి చెబుతారని నరసింహారెడ్డి హెచ్చరించారు.

పోడు భూముల సాగుదార్లకూ పరిహారం

సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర- ఇబ్రహీంపట్నం: దశాబ్దాల తరబడి రాష్ట్రవ్యాప్తంగా పేదల సాగులలో ఉన్న పోడు భూములలో తుపాను బీభత్సానికి పంటలు, పండ్ల తోటలు నష్టపోయిన గిరిజన దళిత బడుగు బలహీన వర్గాల పేదలకు తగిన పరిహారం అందించి ఆ పేద సాగుదారులను కూడా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో భూ పోరాటాల ద్వారా సాధించుకున్న దశాబ్ది కాలంగా సాగు చేసుకుని పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్న వేలాది మందికి సంబంధించిన పోడు, ప్రభుత్వ బంజరు భూముల్లో మిచౌంగ్ సృష్టించిన బీభత్సానికి పంటలు, పండ్ల తోటలు నష్టపోయిన ప్రాంతాలలో సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించి నష్టాలను పరిశీలించింది. మైలవరం, పోరాటనగర్, బూరుగ గూడెం తదితర ప్రాంతాల్లో నేలమట్టమైన మామిడి, జీడి చెట్లను పరిశీలించి రైతులను ఓదార్చారు. అనంతరం మైలవరంలో విలేకర్లతో మాట్లాడుతూ, తమ పరిశీలనలో గుర్తించిన పంటల నష్ట తీవ్రతను వెల్లడించారు. పేదల స్వాధీనంలో ఉన్న పోడు భూములు, వివిధ రకాల ప్రభుత్వ బంజరు భూములలో గత నాలుగు దశాబ్దాలుగా పెంచుకొని పంటలను అనుభవిస్తున్న మామిడి, జీడి తోటలు తుపాను వల్ల సంభవించిన అతివృష్టి, పెనుగాలులకు నేలమట్టమయ్యాయని తెలిపారు. వేలాది మంది నిరుపేద సాగుదారులు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సీజన్‌లో వారి పంటలు నష్టపోయి ఒక పక్క దశాబ్దాల తరబడి జీవనమిస్తున్న పండ్ల చెట్లు నేలమట్టమైన దృశ్యాలు చూస్తుంటే హృదయ విదారకంగా ఉందన్నారు. నిబంధనల విషయం ఎలా ఉన్న మానవత్వంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని రకాల ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న పేదవారికి తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేశ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బాణావత్ పెదబాలు నాయక్, నాయకులు సందీపాము శేషయ్య, రత్నకుమారి, శివా నాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అద్భుత ఆవిష్కరణ

బహుళ ప్రయోజక డ్రోన్‌కు రూపకల్పన

విశాలంధ్రబ్యూరో-అనకాపల్లి: రైతులకు, యువతకు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించే విధంగా ఓ విద్యార్థి బహుళ ప్రయోజక డ్రోన్‌ను రూపొందించాడు. అనకాపల్లి జిల్లా కొత్తూరు నర్సింగరావుపేట గ్రామానికి చెందిన అప్పికొండ దుర్గాప్రసాద్ ఆచార్య నాగార్జున వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చరల్ డిప్లొమా చదువుతున్నాడు. స్వగ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ... తాను రూపొందించిన డ్రోన్ అన్ని ప్రభుత్వ శాఖలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అంతేకాకుండా ప్రపంచం లోనే ఇదే మొట్ట మొదటి మల్టిపర్పస్ డ్రోన్ అని తెలిపారు. 15 డ్రోన్లు చేసే పని ఈ ఒక్క డ్రోనే చేస్తుందన్నారు. ఈ డ్రోన్ వ్యవసాయ, ఉద్యానవన మొక్కలకు ఉపయోగపడే విధంగా తయారు చేసినట్లు తెలిపారు. విత్తనాలు చల్లడానికి, మొక్కలకు చెట్లకు నీటిని స్ప్రే చేయడానికి , ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. 3 సంవత్సరాలు కష్టపడి రూ.11 లక్షల వ్యయంతో ఈ మిషన్‌ను తయారు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా త్వరలోనే దీన్ని ప్రారంభిస్తామని దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ ఆవిష్కరణ వెనుక కుటుంబ సభ్యులు, యూనివర్సిటీ ప్రొఫెసర్, స్థానికులు అందించిన సహకారం మరువలేనిదని దుర్గాప్రసాద్ తెలిపారు.

KAKINADA MUNICIPAL CORPORATION
'e' Procurement Notification

ROC. No.7195/2023/E2, **Dt : 11-12-2023**

Tenders invited through ap e-procurement platform for 79 works with an estimated contract value of **Rs. 7,71,91,319/-** from the eligible contractors in the following manner.

Seventy Seven Works for an amount of Rs. 6,96,86,005/-

Last date and time for downloading bid documents : **22.12.2023 upto 02-00 PM**
Last date and time for submission of bids : **22.12.2023 upto 02-30 PM**

Two Works for an amount of Rs. 75,05,314/-

Last date and time for downloading bid documents : **29.12.2023 upto 02-00 PM**
Last date and time for submission of bids : **29.12.2023 upto 02-30 PM**

Tender Inviting Authority : **Commissioner, Municipal Corporation, Kakinada.** Mail : Call Centre Phone : 0884-2357722.
Further Details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Sd/- CH. Naga Narasimha Rao (FAC),
Commissioner
Municipal Corporation, Kakinada

సంపాదకీయం

ప్రశ్నలు మిగిల్చిన సుప్రీం తీర్పు

జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని 2019 ఆగస్టు 5న రద్దు చేయడం చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ నాయకత్వంలోని అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం ఈ తీర్పు చెప్పింది. తీర్పు ఏకగ్రీవమే అయినా మూడు తీర్పులు వెలువరించారు. ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్, న్యాయమూర్తులు గవాయి, సూర్యకాంత్ కలిసి ఒక తీర్పు వెలువరించారు. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, సంజయ్ కిషన్ కౌల్ విడివిడి తీర్పులు ప్రకటించారు. మొత్తం మీద 370వ అధికరణాన్ని ప్రభుత్వం రద్దు చేయడం సబబేనన్నది అన్ని తీర్పుల్లోనూ ఉన్న ప్రధానాంశం. నాలుగేళ్ల నిరీక్షణ తరవాత ఈ తీర్పు వెలువడింది. దీని పర్యవసానం ఏమిటంటే 370వ అధికరణం ఇక రాజ్యాంగంలో భాగంగా ఉండదు. కానీ 370వ అధికరణం రద్దు చేయడానికి ప్రభుత్వం అనుసరించిన ప్రక్రియను సుప్రీంకోర్టు తప్పు పట్టింది. ఒక ప్రక్రియ తప్పు అయితే మిగతా ప్రక్రియలు న్యాయబద్ధమైనవి ఎలా అవుతాయో సుప్రీంకోర్టు విడమర్చలేదు. 367వ అధికరణం ప్రకారం రాజ్యాంగంలో మార్పులు చేయడానికి పార్లమెంటుకు అవకాశం ఉన్న మాట నిజమే అయినా దానికి రాష్ట్రపతి ఉత్తర్వు జారీ చేయాలి. దానికి అనుగుణంగా రాష్ట్రపతి ఉత్తర్వు 372 వెలువడింది. ఈ ఉత్తర్వు ప్రకారం జమ్మూ-కశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక సభ సమ్మతి లేకుండా 370వ అధికరణాన్ని రద్దు చేయడానికి వీలు లేదు. ప్రస్తుతం జమ్మూ-కశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక సభ లేదు. అనుకున్నప్పుడల్లా రాజ్యాంగ నిర్ణాయక సభ ఏర్పాటు చేయడమూ కుదరదు. కనక కేంద్ర ప్రభుత్వం శాసనసభనే రాజ్యాంగ నిర్ణాయక సభగా భావించింది. కానీ శాసనసభ అప్పటికే రద్దయింది. కనక మోదీ ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్‌నే శాసనసభ ప్రతినిధిగా భావించింది. దీనికోసం 367వ అధీకరణానికి తమకు అనుకూలమైన వ్యాఖ్యానాలు చేసింది. పరిభాషను తమకు అనుకూలంగా మలుచుకుంది. ఇలా పరిగణించడం పొరపాటు అని సుప్రీంకోర్టు భావించింది. ఇది పొరపాటు అని సుప్రీంకోర్టు చెప్పినా రాజ్యాంగాన్ని సవరించడానికి, 370వ అధికరణాన్ని రాజ్యాంగం నుంచి తొలగించడానికి కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంది కనక 370వ అధికరణం సబబేనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ సవరణకు అనుసరించిన మార్గమే తప్పు అయినప్పుడు మిగతా ప్రక్రియలు సరైనవి ఎలా అవుతాయో మాత్రం రాజ్యాంగ ధర్మాసనం విడమర్చలేదు. కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఈ డొంక తిరుగుడు విధానం లోపభూయిష్టమైందని భావించినా ప్రభుత్వం తీసుకున్న చర్య న్యాయబద్ధమే అయిందని సుప్రీంకోర్టు భావించిందంటే 370వ అధికరణాన్ని తొలగించినందువల్ల ఇక చేసేది ఏముంది అని విజ్ఞులైన న్యాయమూర్తులు భావించారనుకోవాలి. 370వ అధికరణం తాత్కాలికమైందని సుప్రీంకోర్టు తెలియజేసింది. తద్వారా 370వ అధికరణం తొలగింపును శంఖంలో పోసేసింది. జమ్మూ-కశ్మీర్ ఎప్పుడూ సార్వభౌమాధికారం ఉన్న ప్రాంతం కాదన్నది న్యాయమూర్తుల వింగడింపు. 370వ అధికరణాన్ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ మొత్తం 23 పిటిషన్లు దాఖలైనాయి. ఏమిటంటే జమ్మూ-కశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక సభ అనుమతి లేకుండా 370వ అధికరణాన్ని తొలగించడానికి వీలు లేదన్నది ఈ పిటిషన్లన్నింటిలోనూ ఉమ్మడిగా కనిపించే వాదన. కానీ రాజ్యాంగ నిర్ణాయక సభ ఎప్పుడు పడితే అప్పుడు ఏర్పాటు చేసేది కాదు కనక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సబబేనని చెప్పడానికి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రత్యేక తర్కాన్ని వినియోగించుకుంది.

జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేయడానికి కేంద్రానికి అధికారం ఉందా లేదా అన్నది ఇక్కడ కీలకమైన ప్రశ్న. ఈ అంశాన్ని కూడా సుప్రీంకోర్టు ఇదమిద్దంగా తేల్చకుండా కేంద్ర ప్రభుత్వ హామీనే అంగీకరించింది. 2019 ఆగస్టు 5న 370వ అధికరణాన్ని రద్దు చేయడంతో పాటు ఆ ప్రాంత రాష్ట్ర ప్రతిపత్తి కూడా కేంద్రం లేకుండా చేసింది. కానీ ఆ సమయంలో త్వరలోనే ఆ ప్రాంత రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని కేంద్రం ప్రకటించింది కనక ఇప్పుడు వెంటనే ఆ పని చేసి అక్కడ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2024 సెప్టెంబర్‌లోగా జమ్మూ-కశ్మీర్ శాసనసభ ఎన్నికలు జరగాలని సుప్రీంకోర్టు ఆదేశాల సారాంశం. వీలైనంత త్వరగా ఆ రెండు కేంద్ర పాలిత ప్రాంతాల రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న మాట. కానీ లదాఖ్‌ను మాత్రం కేంద్ర పాలిత ప్రాంతంగానే ఉంచుతామని కేంద్రం ఇప్పటికీ చెప్తోంది. రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువడినా పిటిషనర్లు లేవనెత్తిన కొన్ని అంశాలకు ఇప్పటికీ సమాధానం లేదు కనక పిటిషనర్లు మరింత విస్తృతమైన బెంచికి నివేదించాలని అభ్యర్థించే అవకాశం మిగిలే ఉంది. 370వ అధికరణాన్ని రద్దు చేయడానికి 367వ అధికరణానికి భాష్యం చెప్పిన తీరు తప్పిదం అయినప్పుడు మిగతా చర్యలన్నీ ఎలా న్యాయబద్ధమైనవి అవుతాయి అన్న ప్రశ్నకు సుప్రీంకోర్టు తీర్పులో సమాధానం లేదు. జమ్మూ-కశ్మీర్ విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్య అనేక అంశాలతో కూడిన గొలుసు అయినప్పుడు, అందులో ఒక లంకె తప్పని సుప్రీంకోర్టే చెపుతున్నప్పుడు మిగతా చర్యలన్నీ సబబు ఎలా అవుతాయో సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతుంది. రాజ్యాంగంలోని 3వ అధికరణం ప్రకారం కేంద్రానికి ఈ అధికారం ఉందా లేదా అన్న విషయాన్ని తాము నిర్ణయించబోవడం లేదని రాజ్యాంగ ధర్మాసనం చెప్పడం ద్వారా మరో ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండానే వదిలేసింది. 370వ అధికరణం అసమతుల్య సమాఖ్య (ఫెడరల్) విధాన లక్షణమేతప్ప సార్వభౌమాధికారానికి సంబంధించింది కాదని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. జమ్మూ-కశ్మీర్ సార్వభౌమాధికారం గల ప్రాంతమన్న వాదన ఎవరూ చేయడం లేదు. ప్రత్యేక ప్రతిపత్తి లేకుండా పోయిందన్నదే అసలు సమస్య. మొత్తం మీద ఈ తీర్పు 370వ అధికరణం రద్దు వెనక ఉన్న అసలు ఉద్దేశం సబబు అవునో కాదో మాత్రం తేల్చలేదు. 370వ అధికరణం తాత్కాలికమైందేనని అనుకున్నప్పటికీ అది ప్రత్యేక పరిస్థితుల్లో జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడానికి ఉద్దేశించిందే. ఆ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడానికి అనువైన పరిస్థితులు ఆ ప్రాంతంలో ఉన్నాయా అన్న ప్రశ్నకు సమాధానం ఎక్కడ వెతుక్కోవాలో తెలియదు. 370వ అధికరణం రద్దు ఎప్పటి నుంచో సంఘ్ పరివార్ ఎజెండాలో భాగం. గతంలో వాజపేయి ప్రభుత్వం వివాదాస్పదమైన ఈ అంశాన్ని పక్కన పెట్టింది. అప్పుడు వాజపేయి ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ లేదు. ఇప్పుడు మోదీ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉంది కనక తమ ఎజెండాను పూర్తి చేసేశారు. దీనికి సుప్రీంకోర్టు ఆమోద ముద్ర వేసేసింది. జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి అవసరమా, కాదా అన్న అంశాన్ని స్థానిక పరిస్థితుల ఆధారంగా కాక సంఘ్ పరివార్ ఎజెండా ప్రకారం ఎలా నిర్ణయిస్తారన్నది సమాధానం లేని ప్రశ్నే.

సమస్యల సుడిగుండంలో గొర్రెల, మేకల పెంపకందారులు

కె.రామాంజనేయులు

రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని కాపాడేందుకు రైతాంగాన్ని, రైతాంగానికి సహాయంగా ఉన్న వ్యవసాయ కూలీలకు వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి రైతులను, గొర్రెల మేకల పెంపకందారులను అన్ని విధాల ఆదుకుంటామని, ఎన్నికల్లో అధికారంలోకి రాకముందు మేము అధికారంలోకి వస్తే మంచిరోజులు వస్తాయని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ఒక్కసారి తనకు అవకాశంఇస్తే సంక్షేమ రాజ్యాన్ని స్థాపిస్తానని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన రాజకీయ పార్టీ పేరులోనే రైతు, యువజన, శ్రామికుల కోసం పనిచేస్తామని నమ్మబలికాడు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పాలన ముగిసి కొద్దినెలల్లో ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. వారు చేసిన వాగ్దానాలు నీటిమూటలుగా మిగిలిపోయాయి.

రాష్ట్రంలో వ్యవసాయానికి అనుబంధంగా గొర్రెల, మేకల పెంపకం ప్రధాన జీవనాధారంగా ఉంది. రాష్ట్రంలో రెండుకోట్ల ఇరవై ఒక్క లక్షల గొర్రెలు, మేకల సంపద ఉంది. గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘాలు అనేకం ఉన్నాయి. సుమారు 4 లక్షలమంది గొర్రెల మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామీణ స్థాయిలో గొర్రెలు మేకల పెంపకందారుల సొసైటీలు, జిల్లా స్థాయిలో జిల్లా యూనిట్ యూనియన్‌లు, రాష్ట్రస్థాయిలో ఫెడరేషన్లు ఏర్పడ్డాయి. నేతి బీరకాయలో నెయ్యి సామెత చందంగా వీటికి నిధులు, విధులు లేవు. ప్రభుత్వాల నిర్లక్ష్యానికి తోడుగా ప్రతి ఏదాది గొర్రెలు, మేకలకు అంతుచిక్కని వ్యాధులు సోకి లక్షల సంఖ్యలో చనిపోతున్నాయి. పశువుల వైద్యశాలలో జీవాలకు వైద్యం అందుబాటులోలేదు. పుట్టిన జీవాల్లో 30శాతం మృత్యువాతపడుతున్నాయి. పశువైద్యుల కొరత వెంటాడుతోంది. రైతు భరోసా కేంద్రాల్లో వెటర్నరీ అసిస్టెంట్లను పెట్టినా తగిన ఫలితంలేదు. మొబైల్ పశువైద్య క్లినిక్‌లు నడుపుతున్నామని చెబుతున్నా వాటి జాడ తెలియదు.

పశువైద్య కేలండర్‌లో ప్రకటించిన విధంగా సీజనల్ వారీగా వాక్సిన్లు వేయడంలేదు. నాలుగుసార్లు నట్టల నివారణమందు జీవాలకు అందిస్తామనిచెప్పి ఒక్కసారి మాత్రమేవేసి సరిపుచ్చుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే జీవాల సంరక్షణ, మేలుజాతి విత్తన పొట్టేళ్లు పంపిణీ చేయకపోవడం వల్ల జీవాల సంపద, అభివృద్ధి కుంటుబడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్.సి.డి.సి) విడుదలవుతున్న అవుతున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్ళించి ఖర్చుచేయడం లేదు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత చేతివృత్తులలో చేనేత రంగానికి గతంలో ఉన్న జాతీయ చేనేత అడ్వయిజరీ బోర్డును రద్దుచేసి చేతివృత్తిదారుల పట్ల తన వైఖరిని ఏంటో రుజువు చేసుకున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆరు నెలల్లో ఎన్నికలకు ముందు 18 రకాల చేతివృత్తిదారులను ఆదుకుంటామని విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రకటించి అందులో గొర్రెల మేకల పెంపకందారుల వృత్తిని చేర్చి, గొర్రెల మేకల పెంపకం దారులకు 3 కోట్ల రూపాయల వరకు సబ్సిడీ రుణాలు అందిస్తామంటున్నారు. చేతి వృత్తుదారులకు రెండు లక్షల రూపాయలు కూడా బ్యాంకులు సొంత పూచీకత్తుతో రుణాలు అందజేయని బ్యాంకులు ఎలాంటి పూచీ లేకుండా మూడు కోట్ల రుణాలు గొర్రెలు మేకల పెంపకందారులకు ఎలా రుణాలు ఇస్తాయి? చిత్తశుద్ధి ఉంటే రెండు లక్షల నుంచి 5 లక్షల రూపాయల వరకు ఈ పథకాన్ని వర్తించే విధంగా సామాన్య గొర్రెల మేకల పెంపకం

దారులకు సహాయపడే విధంగా చేస్తే ఉపయోగపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం 80 కోట్లు ఖర్చుచేసి పెంపకందారులకు జీవనోపాధి కల్పించాలి కానీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 43 కోట్ల ఖర్చుచేసి చేతులు దులుపుకుంది. ప్రతి నెల వేలాది కోట్ల రూపాయలను సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న వ్యయం చేతివృత్తిదారులకు, అందులో భాగంగా గొర్రెల మేకల పెంపకం దారులకు చేరుతున్నది ఎంత? గత సంవత్సరం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. ఈ సంవత్సరం అతి గతీ లేదు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో జీవనోపాధికోసం 5 వేల కోట్లు ఖర్చుచేసి నూతనంగా జీవాలు పెంచుకునే వారిని ప్రోత్సహించి జీవనోపాధి కల్పించింది. యూనిట్ 1,75,000 ఇందులో 133,000 సబ్సిడీ ఉంది. ఈ మాదిరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆలోచించకపోవడం బాధాకరం. దీంతో కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద రుణాలు ఇప్పిస్తామని 2017 పథకాన్ని తెచ్చింది. ఈ పథకాన్ని పరిశీలిస్తే గొర్రెల, మేకల పెంపకంలో బడా పెట్టుబడిదారులను ప్రోత్సహించే పద్ధతిలో ఈ పథకం అమలు జరిగే రాష్ట్రంలో సంప్రదాయ పెంపకందారులందరూ అంతరించిపోతారు. దానివల్ల గ్రామీణ ప్రాంతంలో గొర్రెలకాపరుల జీవన విధానం ఛిన్నాభిన్నమవుతుంది. ఈ పథకం గ్రామీణ పేదలైన గొర్రెలు పెంపకందారులను ప్రోత్సహించే విధంగా ఉండాలి. గత నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం పశునష్ట బీమా పథకాన్ని తీసుకొచ్చారు. పశువులు చనిపోతే వెంటనే నష్టపరిహారం ఇస్తామని చెప్పింది కానీ ఈ పథకం గొర్రెల, మేకల పెంపకందారులకు పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదు. గొర్రెలు, మేకలు వ్యాధులతో చనిపోయినప్పుడు పోస్టుమార్టం చేయడానికి పెంపకందారులు సొంతంగా రిస్క్ తీసుకొని పశు వైద్యుల దగ్గరికి వెళ్లాలి. ప్రతి మండల కేంద్రంలో పశు వైద్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. పెద్ద సంఖ్యలో గొర్రెలు మేకలు చనిపోయినప్పుడు పశువైద్య అధికారులే స్వయంగావెళ్లి పరిశీలించి పోస్టుమార్టం చేయాలి. ఇప్పటికీ వందల కోట్ల రూపాయలు పశునష్ట బీమా పథకం కింద పెంపకం దారులకు అందవలసిఉండగా ఈ పథకాన్ని రద్దుచేసి మరలా పశువుల బీమా పథకాలు తీసుకొని వచ్చి బీమా ప్రీమియం గొర్రెల, మేకల పెంపకందారులపై రుద్దింది. గతంలో గొర్రెలు, మేకల షెడ్లు నిర్మించుకుంటే నిధులు ఇస్తామని చెప్పి ఆచరణలో విస్మరించింది. గ్రామీణ ప్రాంతాలలో పశువులు గొర్రెలు, మేకలు, మేపుకోవడానికి ఉన్న ప్రభుత్వ భూములన్ని అధికార పార్టీ నాయకులు కబ్జాచేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంచేసి గొర్రెల, మేకల పెంపకందారులు మేపుకోవడానికి భూములు లేకుండా చేస్తున్నారు. ఈ విధంగా ఏ పథకాన్ని చూసినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గొర్రెల మేకల సంరక్షణ జీవాల అభివృద్ధి జీవనోపాధి వృద్ధి పెంపకందారుల సంక్షేమం పట్ల పూర్తిగా చిన్న చూపు కనపడుతోంది. అందుకే గొర్రెల మేకల పెంపకందారులందరూ ఐక్యమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ఒత్తిడితెచ్చి గొర్రెల మేకల పెంపకానికి సమగ్ర విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేయాలి. ఈ సందర్భంగా ప్రధానంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉంచాల్సిన ప్రధాన డిమాండ్లు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ప్రతి గొర్రెల మేకల పెంపకం దారులకు 90 శాతం సబ్సిడీతో 2 లక్షల రూపాయల నుంచి 5 లక్షల రూపాయల వరకు మంజూరుచేసి జీవనోపాధి కల్పించాలి. గొర్రెల, మేకల సహకార సంఘాలజిల్లా ఎన్నికలు నూతనంగా ఏర్పడిన జిల్లాల ఆధారంగానే నిర్వహించాలి. రాష్ట్ర ఫెడరేషన్‌కు ఎన్నికలు జరపాలి. గొర్రెల, మేకల సంరక్షణకు సీజనల్ వారిగా వాక్సినేషన్లు అందించి మరణాల రేటు తగ్గించాలి. గొర్రెల, మేకల పెంపకం ఉన్న ప్రాంతాల్లో ప్రతి మండల కేంద్రంలో క్లినిక్‌లు ప్రత్యేకంగా మొబైల్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి జీవాలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొని రావాలి. సంవత్సరానికి నాలుగుసార్లు నాణ్యత కలిగిన నట్టల నివారణ మందులు జీవాలకు అందించాలి. బ్రీడింగ్ పాలసీ తీసుకొని వచ్చి గొర్రెలు, మేకల అభివృద్ధికి నాణ్యమైన విత్తన పొట్టేలును అందించాలి. జీవో ఎంఎస్ నంబర్ 559 జీవో నంబర్ 10, 16 ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో బంజరు భూములు లంక భూములు గ్రామ ఉమ్మడి భూములు జీవాలమేత నిమిత్తం గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంఘాలకు కేటాయించాలి. అడవుల్లో జీవాలు మేపుకోవడానికి ఫారెస్ట్ అధికారుల వేధింపులు అరికట్టాలి. పుల్లరి లేదా శిస్తులు, జరిమానాలను రద్దు చేయాలి. గొర్రెల, మేకల పెంపకందారుల కుటుంబాల పిల్లలకు శిక్షణ ఇచ్చి వారిని రైతు భరోసా కేంద్రాలలో వెటర్నరీ అసిస్టెంట్లుగా నియమించాలి. కరువు ప్రాంతాల్లో బోర్లువేసి నీటి సౌకర్యం, జీవాలకు పశుహాస్టల్ ఏర్పాటు, క్యాటిల్ క్యాంపులు, పోషకాలు కలిగిన ధాన్యాన్ని అందించాలి. ఈ డిమాండ్ల సాధనకోసం డిసెంబర్ 13వ తేదీన డోన్‌లో జరిగే గొర్రెల మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సులో చర్చించి భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధమవుతారని ఆశిద్దాం.

(2023 డిసెంబర్ 13న డోన్ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దార్ల రాష్ట్ర సదస్సును జరుగుతున్న సందర్భంగా)

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ చేతివృత్తి దారుల సమాఖ్య
సెల్:94401 46608

పిడుగుపాటు

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

అరుగు ఎక్కిన డాగీ అటూ ఇటూ అసహనంగా తిరుగుతున్నది. ఎందుకలా తోక తెగిన కుక్కలా తిరుగుతావు. వర్షపు నీళ్లు పడని చోట కూచో రాదూ అంది డాంకీ. అసలు ఈ వర్షాలు ఎప్పుడు పడితే అప్పుడు ఎందుకు పడాలి. నాకు భయంగా ఉంది. ఆ ఉరుముల చప్పుడు వింటే. పిడుగేదన్నా వచ్చి మీద పడుతుందేమో ఏం చేద్దాం అంది డాగీ తడిసిన ఒళ్లు దులుపుకుంటూ. చప్పుళ్లకే భయపడుతున్నావా. ఎక్కడ చప్పుడు వినపడుతుందో అక్కడ పిడుగు పడదు. ఇక్కడ మన రాష్ట్రంలో పెద్ద చప్పుడయితే పక్క రాష్ట్రంలో పిడుగు పడుతుంది అంతే అంది డాంకీ. అంటే చప్పుడు ఒకచోట, పిడుగు మరోచోట అంటావు అంది డాగీ. కాదామరి, చైనాలో కోవిడ్ వస్తే భారత్‌లో జనం చేతులు కడగలేదూ, చప్పట్లు చరవలేదూ. 'కాజ్ అండ్ ఎఫెక్ట్' అంటారు. మన రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు పొరుగు రాష్ట్రంలో నాయకులకు వణుకు పుట్టించటంలో ఆశ్చర్యం లేదు మరి అంది డాంకీ. ఈ ఊరికి ఆ ఊరెంత దూరమో ఆ ఊరికి ఈ ఊరంతే దూరం. అక్కడా, ఇక్కడా ఒకేలా జరుగుతుందేమిటీ అన్నది డాగీ. జరిగితే ఆశ్చర్యం లేదు. నాయకుల డి.ఎన్.ఏ. అక్కడా, ఇక్కడా ఒకటే. ఓటర్ల లక్షణాలు ఇక్కడా అక్కడా ఒకటే. అలాగనకు డాంకీ అక్కడ అనేక ఉచితాలు ఉన్నాయి కదా అంది డాగీ. ఉచితాలు వచ్చేదీ చచ్చేదీ లేదు కాని 'బటన్' లు నొక్కడం మాత్రం జోరుగానే ఉందిలే. ఎలక్షన్లు వస్తున్నాయని ఉద్యోగ నియామకాల హడావిడి కూడా మొదలైంది. ఇంకేం ప్రభుత్వానికేం ధోకా లేదనుకుంటాను వర్షం తగ్గడంతో ఓ మూల కూచుంటూ అంది డాగీ. ఈ మధ్య సర్కారు వారు దేవుళ్లను కూడా అనుగ్రహించటం మొదలుపెట్టారు భక్తులకు సదుపాయాల కోసం ఖర్చుచేస్తున్నారు. ఇది మరో ప్లస్ పాయింటు. సనాతన ధర్మం కూడా సహాయం చేస్తుంది అని డాంకీ అంటుంటే ఒకమనిషి హడావిడిగా వచ్చి అరుగుఎక్కి డాగీని చూసి నిలబడిపోయేడు. ఈ వచ్చినవాడు సాధువులా ఉన్నాడు గడ్డమూ, బుర్ర బాగానే పెంచాడు. ధోవతీ కదా పిక్కకూడా మగ్గిన మామిడిపండులా కనిపిస్తున్నది ఓ 'బైట్' వేసుకోనా? చిరకాలపు వాంఛ తీర్చుకోనా? అన్నది డాగీ మనిషికి అర్థంకాని తమ భాషలో, వద్దోయ్! చెప్పాపెట్టకుండా తొడపాశాలు పెట్టడం నాయకుల లక్షణం కానీ నీలాంటి కుక్కలకు అది తగదు. ఈయనెవరో భూత భవిష్యత్తు వర్తమానాలు చెప్పే ఉద్దండుడిలా ఉన్నాడు. ఈయన ఫోటో పేపర్లో చూసినట్టు గుర్తు. అరుగు ఎక్కనీ మన సందేహాలు తీరుస్తాడేమో చూద్దాం అని అదే భాషలో అంది డాంకీ. అయితే సరే మనిషికి అర్థమయ్యే భాషే మాట్లాడుదాం స్వామీజీ! భయంలేదు రండి. నేను మొరిగే కుక్కనేకాని కరిచే కుక్కను కాను అంది డాగీ. కుక్క మనిషిలా మాట్లాడ్డం చూచి కిందపడబోయి తమాయించుకున్నాడు 'జోషి". మీరేం కంగారు పడకండి మేమిద్దరమూ మీతో మనుషుల భాషలో మాట్లాడ్డం ఎవరికీ చెప్పకండి రండి పొడిగా ఉన్నచోట కూర్చోండి అన్నది డాంకీ. పరుగెత్తుకు వచ్చిన ఆయాసం తీర్చుకున్నాక అడిగాడు స్వామి మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు అని, ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్ర ఏమి చెయ్యడం లేదు కానీ తమరు మా ఈ కూలిన కొంపను పావనం చెయ్యడానికి కారణమేమిటో అంది డాగీ. అంతా నా ఖర్మ. ఎన్నికల్లో ఖచ్చితంగా గెలుస్తాడని చెప్పిన ఓ నాయకుడికి డిపాజిట్ కూడా దక్కలేదని నా మీదకి రౌడీల్ని పంపాడు. వాళ్లని తప్పించుకొని ఇక్కడికొచ్చి పడ్డాను అన్నాడు జోతిష్కుడు.తెలీకపోతే తెలీనట్టుండాలి. అబద్ధాలు చెప్పి తన్నించుకోవడం ఎందుకు అన్నది డాంకీ. అబద్ధాలా? నేనా? అసలా మాటే తెలియదు నాకు. పదిసంవత్సరాల నుంచీ నేను చెప్పిన జోస్యానికి తిరుగులేదు తెలుసా? అన్నాడు జ్యోతిష సామ్రాట్. స్వామి తమరి జోస్యం అంత గొప్పదే అయితే ఆ నాయకుడి డిపాజిట్టు గల్లంతయిందేం అంది డాగీ. చాలా మందికి చెప్పాను. పాత ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని గవ్వలు వేసి చూసి చెప్పాను. పరిహారాలు చెప్పాను. యాగాలు కూడా చేయించాను. అదేమిటోగానీ లెక్క తప్పింది. ఎందుకు తప్పిందా అని ఆలోచిస్తే తేలింది అన్నాడు స్వామి. ఏమిటో అది అన్నవి డాంగీ, డాంకీ జమిలిగా. ఈ మధ్య మనవాళ్లు చంద్రయాన్ పేర చంద్ర గ్రహాన్ని అపవిత్రం చేశారుగా. మిగతా గ్రహాల్లోకీ మనుషులు వచ్చి వాటి 'ప్రైవసీ'కి భంగం కల్గిస్తారని కాబోలు గ్రహాల గతులు మారాయి. అడ్రసులు మారాయి. అందువల్లే ఈ గందరగోళం అన్నాడు స్వామి నున్నటిగుండు మీదినుంచి జారుతున్న వాననీటిని కండువాతో అద్దుకుంటూ. ఈ రాష్ట్రం సంగతి సరే తెల్సిపోయింది. పక్క రాష్ట్రం సంగతేమిటీ, పొత్తు కల్సిన వాళ్లు లాభపడతారంటారా అనడిగింది డాగీ. చెప్పాను కదా గ్రహాలు ఆగ్రహంగా ఉన్నవి. అనుకున్న దానికంటే అనుకోనిదే జరగవచ్చు. అనుకోనిది జరగకపోయినా అనుకున్నదే జరగవచ్చునన్నాడు స్వామి. రౌడీలు తరమడంవల్ల తమరి మెదుల్లా ఆబ్లాంగెటా కేదో కీడు సంభవించినట్టుంది. రౌడీలు మరో గల్లీలోకి వెళ్లారు తమరు దయచేయవచ్చు అంటూ అరుగు ఎక్కాడు తెలుగు అబ్బాయి.స్వామిజీ వెళ్లిపోయాక అడిగింది డాంకీ, ఉద్యోగాలు వస్తున్నాయటగదా అని. "నోటిఫికేషన్లు వస్తాయి ఎప్పటిలాగానే ఓట్లుపడ్డాక ఉద్యోగాలు మాత్రం రావు. ఉచితాలు ఎవరైనా ఇచ్చేదే. ఓట్లు ఎవరైనా కొనేదే అని ప్రజలు తమ ఆలోచన్లకి పదును పెడ్తున్నారు. తెలివిమీరిన ఓటర్లు ఎవరిని ఓడించాలనుకోవాలనుకుంటే వారిని ఓడిస్తారు. గెలుపు మీద కంటే ఓడించడం మీద 'కాన్‌సెన్‌ట్రేట్' చేస్తున్నారు అన్నాడు అబ్బాయి. ఎవరు గెలిస్తే ఏం? ఎవరు ఓడితేనేం? ఎలెక్షన్ల పుణ్యమా అని పోస్టర్లు, కరపత్రాలతో హాయిగా కడుపు నింపుకుంటున్నాను అన్నది డాంకీ.

ఉరుము శబ్దం ఒకచోటయితే పిడుగు పడేది మరొక చోట అన్న డాంకీ మాట నిజం అనిపిస్తున్నది అంది డాగీ ఆకాశం వంక చేస్తూ.

కాంగ్రెస్ బలహీనతలే బీజేపీని గెలిపించాయి

పతకమూరు దామోదర్ ప్రసాద్

ఇటీవల తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఈశాన్య రాష్ట్రం మిజోరం శాసనసభకు జరిగిన ఎన్నికలలో బీజేపీ మూడు రాష్ట్రాలలో విజయం సాధించగా, కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని ఆశలు పెట్టుకున్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కమలం పార్టీ ఘన విజయం సాధించింది. ఇప్పటి వరకు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న రాజస్థాన్, ఛత్తీసగడ్ రాష్ట్రాలలోనూ కాషాయం పార్టీ గెలుపొందింది. కాంగ్రెస్ బలహీనతలను అవకాశంగా తీసుకుని ఇక్కడ బీజేపీ గెలుపొందింది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వాన అధికారంలోకి రావడం కాంగ్రెస్‌కు కొంత ఊరట. 40అసెంబ్లీ స్థానాలు గల ఈశాన్య రాష్ట్రం మిజోరంలో లాల్ దుహోమా నేతృత్వంలోని జోరాంగ్ పీపుల్స్ మూవ్‌మెంట్ అధికార మిజో నేషనల్ ఫ్రంట్ ను ఓడించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ 27స్థానాలు గెలవగా' ఎంఎన్‌ఎఫ్ కు 10స్థానాలు గెలుచుకోగా, బీజేపీ కేవలం రెండు చోట్ల మాత్రమే గెలుపొందింది. తెలంగాణ శాసనసభ 119స్థానాలకు గాను కాంగ్రెస్ 64 స్థానాలు, మిత్రపక్షం సీపీఐ ఒక్క స్థానం గెలిచాయి.కొత్త రాష్ట్రంగా ఏర్పడ్డాక గత పదేళ్లుగా తిరుగులేని అధికారం చలాయించిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ అవినీతి, అక్రమాలు, ప్రజాస్వామ్య వ్యతిరేక ఏకవ్యక్తి నియంతృత్వ, అహంకార పూరిత కుటుంబ పాలనను ముఖ్యంగా కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన వేలకోట్ల అవినీతిని, విద్యుత్ కొనుగోళ్లలో వేల కోట్ల ధన దుర్వినియోగాన్ని సమర్థవంతంగా ఎండగట్టి రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ వెంటనే హస్తం పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సౌకర్యం పరిమితిని రూ.10లక్షలకు పెంచి ప్రజల మన్ననలను అందుకున్నారు. ఇక పెద్ద హిందీ రాష్ట్రాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ లలో విజయసాధనకు కమలనాథులు పకడ్బందీ ముందస్తు వ్యూహంతో కొన్ని నెలల ముందు నుంచే బూత్ స్థాయి మొద లు రాష్ట్ర స్థా యి కమలం శ్రేణులను, నేతలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ చమటోడ్చారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి 48.55 శాతం ఓట్లు రాగా, ఛత్తీస్‌గఢ్‌లో 46.27 శాతం, రాజస్థాన్‌లో 41.7 శాతం ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీకి మధ్య ప్రదేశ్‌లో 2018 ఎన్నికలలో 40.89 శాతం ఓట్లు రాగా ఈ సారి స్వల్పంగా తగ్గి 40.40శాతం ఓట్లు వచ్చాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2018లో 43.04 శాతం ఓట్లు రాగా ఈసారి 42.23 శాతానికి తగ్గాయి. రాజస్థాన్‌లో 2018లో కాంగ్రెస్ పార్టీకి 39.3 శాతం ఓట్లు రాగా ఈసారి అవి 39.5 శాతానికి పెరిగాయి. కాంగ్రెస్ ఆరోగ్య బీమాను రూ50 లక్షలకు పెంచినా, ఎన్నో జన సంక్షేమ పథకాలు అమలు చేసినా ఐదేళ్ల కోసారి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే సంప్రదాయాన్ని రాజస్థాన్ రాష్ట్ర ప్రజలు కొనసాగించారు.

రాజస్తాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో కమలం పార్టీకి ఏడెనిమిది నెలల క్రితం వరకు ఏమంత అనుకూల పరిస్థితులు లేవు. కర్నాటకలో పరాజయం అనంతరం యూపీ, బీహార్ తర్వాత పెద్ద హిందీ రాష్ట్రం మధ్యప్రదేశ్ లో ప్రతికూలత ఉన్నట్లు సంకేతాలు రావడంతో కమలనాథులు ఏడెనిమిది నెలల ముందే జాగ్రత్త పడుతూ వచ్చారు. బూత్ స్థాయి నుంచి పై స్థాయి వరకు బాధ్యులను నియమించి, పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి దిద్దుబాటుకు యత్నించారు. ప్రధాన హిందీ రాష్ట్రాలలో ఓడితే వచ్చే మే లో జరిగే లోక్‌సభ ఎన్నికలలో నెగ్గుకు రావడం కష్టమని కమలనాథులకు అవగతమైంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అన్నీ తానై, అంతటా తానై ప్రచార యుద్ధం సాగించారు. 2018లో ఆయా రాష్ట్రాల నేతలకు ఎన్నికల బాధ్యతలు అప్పగించి పరాజయం పాలైన సంగతి గుర్తించి ఈసారి అభ్యర్థుల ఎంపిక సహా అన్ని విషయాలలో జాగ్రత్తలు తీసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే "కులగణన" చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించడంతో మోదీ అప్రమత్తమయ్యారు. బీసీలు, దళితులు, మహిళలు, ఆదివాసీలు కమలంగుర్తుకు ఓటేసేలా చూడటానికి ,వారి అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించారు. ఓ రకంగా ఈ ఎన్నికలను మోదీ తనపాలనపై రెఫరెండంగా మార్చారు. మహిళలను ఆకట్టుకునేందుకు మధ్య ప్రదేశ్ ముఖ్య మంత్రి ఎన్నికలకు ఐదారు నెలలముందే మహిళలకు "లాడ్ లీ బెహనా" అనే పథకాన్ని ప్రారంభించి వారికి నెలా రూ1000 నగదు రూపంలో కోటి 30లక్షల మంది సహాయంగా ఇవ్వడం కమలం పార్టీకి ఏంటో కలిసొచ్చింది.మహిళల నుంచి కమలం గుర్తుకు 7 శాతం ఓట్లు అధికంగా రావడమే అందుకు నిదర్శనం. ఈ విధంగా కాషాయ పార్టీ తమకు సాంప్రదాయంగా ఓటేసే వర్గాల ఓట్లు రాబట్టుకోవడమేగాక కాంగ్రెస్‌కు మద్దతిచ్చే వారి ఓట్లను కూడా పొంద గలిగింది. మధ్యప్రదేశ్‌లో గత ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ సీఎం పీఠంపై కన్నేసిన గ్వాలియర్ రాజకుటుంబానికి చెందిన జ్యోతిరాదిత్య సింధియా 19మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కమలం పార్టీలో చేరడంతో కమలనాథ్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 18నెలల్లోనే

కుప్పకూలింది.మళ్లీ గెలిచిన శాసన సభ్యుల మద్దతుతో శివరాజ్ సింగ్ చౌహాన్ సీఎంగా బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. చౌహాన్ 16సంవత్సరాలుగా అధికారంలో ఉండటంతో పార్టీ కార్యకర్తలు, కింది స్థాయి నేతలకు విముఖత ఏర్పడింది. కమలనాథ్ ప్రభుత్వాన్ని అర్థాంతరంగా కూల్చేసిన కమలం పార్టీ దుశ్చర్య వల్ల ఈసారి సానుభూతి పవనాలతో గట్టెక్కగలమనే హస్తం పార్టీ ఆశలు అడియాశలయ్యాయి. కమల్, దిగ్విజయ సింగ్ వర్గాల పోరు హస్తం పార్టీకి నష్టం కలిగించింది. ఎన్నికల వాగ్దానాలు అన్నీ ముందే ప్రకటించడంతో కాషాయ పార్టీ జాగ్రత్త పడి జనాకర్షక పథకాలతో ముందుకు రావడంతో కాంగ్రెస్ కొంప మునిగింది. 35ఎస్సీ రిజర్వుడు స్థానాలలో బీజేపీ 26 స్థానాలలో గెలవడాన్ని బట్టి కమలం పార్టీ పై దళితుల మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ కు కేవలం 9 ఎస్సీ స్థానాలు మాత్రమే దక్కాయి.47 ఎస్టీ స్థానాలకు గాను కమలం పార్టీకి24, హస్తం పార్టీకి 22లభించాయి. కాంగ్రెస్ కు మంచి పట్టున్న గ్వాలియర్ - చంబల్ ప్రాంతంలోని 34స్థానాలకు గానూ బిజెపి18, కాంగ్రెస్ 16 స్థానాలు గెలిచాయి. కాంగ్రెస్ తిరుగు బాటు అభ్యర్థులు పోటీ చేసిన 22 స్థానాలలో 19 స్థానాలను బీజేపీ చెక్కించుకోవడం విశేషం. బీజేపీ తిరుగుబాటు అభ్యర్థులు పోటీ చేసిన 22స్థానాలలో కాంగ్రెస్ 8మాత్రమే గెలవ గలిగింది. 98 మంది కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే లలో 13మందికి టిక్కెట్లు నిరాకరించగా మళ్లీ పోటీ చేసిన 85 మందిలో 60 మంది ఓడిపోయారు. 13 మంది కాంగ్రెస్ కొత్త అభ్యర్థుల్లో ఏడుగురు ఓడిపోయారు. బీజేపీ 126 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలలో 34 మందికి టిక్కెట్లు నిరాకరించింది. 97మంది మళ్లీ పోటీ చేయగా 27 మంది ఓడిపోయారు.దీనిని బట్టి బీజేపీ కన్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఎక్కువని తేలింది. కాంగ్రెస్ నేత కమల్ నాథ్ జూన్ లోనే ప్రతి ఇంటికీ 100యూనిట్ల ఉచిత విద్యుత్, 200 యూనిట్లకు సగం బిల్లు, వ్యవసాయ రుణాల రద్దు, రూ500 కే వంట గ్యాస్, ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ వంటి నాలుగు గ్యారంటీలను ప్రకటించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్ కూడా మహిళా సమ్మాన్ యోజన కింద నెలనెలా మహిళలకు రూ1500 నగదు సాయం ఇస్తామని ఆలస్యంగా ప్రకటించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటి సీఎం చౌహాన్ పంచాయతీ రాజ్ తదితర ఉద్యోగుల ద్వారా అప్పటికే లాడ్లీ బెహన్ పథకం కింద పల్లె పల్లెకు అందజేయడం రాజకీయంగా కమలం పార్టీకి లభించింది. 18 ఏళ్ల బీజేపీ పాలనలో మహిళల కోసం ఎన్నోపథకాలు అమలు చేశారు. పంచాయతీలు,పట్టణ స్థానిక సంస్థలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ల కల్పన సహా మహిళా స్వావలంబనకు ఎంతో కృషి జరిగిందని సిఎం చౌహాన్ అన్నారు. బ్రాహ్మణుడైన సర్మను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. నరేంద్ర సింగ్ తోమర్‌ను సీఎం అభ్యర్థుల్లో ఒకరిగా రంగంలోకి తెచ్చి బ్రాహ్మణ, ఠాకూర్ ఓట్లకు కమలం గాలం వేసింది. ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేయడం ద్వారా దేశంలోని 10 శాతం ఆదివాసీ ఓట్లను పొందడానికి కమలనాథులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ ఇప్పటికీ 22స్థానాలు నిలుపు కుంటున్నది. కాంగ్రెస్ కు వచ్చిన 66 స్థానాలలో 3వ వంతు ఎస్టీ స్థానాలు. సంప్రదాయంగా కాంగ్రెస్‌కు ఓటేసే దళితులు, ఆదివాసీల ఓట్ల కోసం కమల నాథులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు.

సీనియర్ జర్నలిస్టు 9440990381.

వాట్సాప్ ద్వారా బస్ టికెట్లు

దిల్లీ: ప్రయాణికుల ఇబ్బందులు తగ్గించేందుకు దిల్లీ సర్కార్ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇక నుంచి వాట్సాప్ ద్వారా బస్ టికెట్లు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటికే దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఈ తరహా సేవలను అందిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో ఇప్పుడు బస్సుల్లోనూ విస్తరించేందుకు నడుం బిగించింది. త్వరలోనే దీనిపై ప్రయాణికులకు శుభవార్త చెబుతామని అక్కడి అధికారులు వెల్లడించారు. అయితే, వాట్సాప్ ద్వారా కొనుగోలు చేసే టికెట్ల సంఖ్యపై పరిమితి ఉంటుంది. వాట్సాప్ ద్వారా కొనుగోలు చేసిన టికెట్‌ను రద్దు చేసుకునే వెసులుబాటు మాత్రం ఉండదు. క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేస్తే చిన్న మొత్తంలో కన్వీనియెన్స్ ఫీజు కూడా వసూలు చేస్తారు. యూపీఐ ఆధారిత పేమెంట్స్‌కు మాత్రం ఎలాంటి అదనపు రుసుము ఉండదు. ఇక హైదరాబాద్ మెట్రో కూడా వాట్సాప్ ద్వారా టికెట్లను బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే.

13 ఏళ్ల తర్వాత సిక్కింను సందర్శించిన దలైలామా

గ్యాంగ్‌టక్: టిబెటన్ ఆధ్యాత్మిక గురువు, 14వ దలైలామా టెన్జిన్ గ్యాట్సో 13 ఏళ్ల తర్వాత సిక్కింను సందర్శించారు. మూడు రోజుల పర్యటన కోసం సోమవారం ఉదయం అక్కడకు చేరుకున్నారు. తూర్పు సిక్కింలోని లిబింగ్ ఆర్మీ హెలిప్యాడ్ వద్ద ఉదయం 10.30 గంటలకు దలైలామా హెలికాప్టర్ నుంచి దిగారు. సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ ఆయనకు స్వాగతం పలికారు. పలువురు బౌద్ధులు సంప్రదాయ నృత్యాలు, ప్రార్థనలతో దలైలామాను ఆహ్వానించారు. ప్రవాస టిబెటన్ పాలకులు కూడా ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం దలైలామా గ్యాంగ్‌టక్‌లోని ఒక హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రహదారికి ఇరువైపుల సిక్కిం ప్రజలు బారులు తీరారు. ఆయనను చూసేందుకు పోటీపడ్డారు. కాగా, 87 ఏళ్ల దలైలామా, 37 బోధిసత్వ సాధనాలపై బోధనలు చేయనున్నారు. భారత్, చైనా సరిహద్దు ప్రాంతమైన నాథులాకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్యాంగ్‌టక్‌లోని పాల్జోర్ స్టేడియంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు బౌద్ధ ప్రార్థనలు, బోధనలు నిర్వహిస్తారు. మరోవైపు గ్యాంగ్‌టక్ జిల్లా సిమ్మిక్ ఖమ్‌డాంగ్ నియోజకవర్గంలో రుమ్‌టెక్, గ్యాల్వా లాట్‌సున్ చెన్‌పో విగ్రహం వద్ద కర్మప పార్క్ ప్రాజెక్టుకు దలైలామా వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని అధికారులు తెలిపారు. గురువారం ఉదయం పశ్చిమ బెంగాల్ సిలిగురిలోని సాలుగరాకు వెళ్తారని చెప్పారు.

హేమంత్ సోరెన్‌కు ఈడీ నోటీసులు

రాంచి: రాంచీలో భూముల క్రయవిక్రయాలు, కొనుగోలు మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ విచారణకు సంబంధించి విచారణకు హాజరు కావాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోసారి సమన్లు పంపింది. దీంతో హేమంత్ సోరెన్ మంగళవారం ఈడీ విచారణకు హాజరయ్యే అవకాశాలున్నాయి. ముఖ్యమంత్రి మంగళవారం రాంచీలోని ఏజెన్సీ జోనల్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యే అవకాశం ఉందని ఒక అధికారి తెలిపారు. గతంలో ఇదే కేసు విషయంలో ఆయనకు ఈడీ ఐదోసారి నోటీసులు పంపించింది. ఈ నోటీసులను వ్యతిరేకిస్తూ సోరెన్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ కేసులో మొదట ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించినప్పటికీ అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కూడా సోరెన్ ఉన్నారు. ఇక తాజాగా ఈడీ ఇచ్చిన నోటీసులను హేమంత్ సోరెన్ ఇంకా సవాలు చేయలేదు.

రాహుల్ సమాధానం చెప్పాలి

సాహు నల్లడబ్బుపై బీజేపీ

న్యూదిల్లీ: ఒడిశా ప్రధాన కేంద్రంగా కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహు కుటుంబం నిర్వహిస్తున్న డిస్టిలరీ కంపెనీపై ఆదాయపు పన్ను విభాగం అధికారులు నిర్వహించిన దాడుల్లో వందల కోట్ల రూపాయలు బయటపడ్డాయి. ఐదురోజులుగా 50 మంది బ్యాంకు అధికారులు 40 కౌంటింగ్ మెషిన్లతో ఆ నోట్ల గుట్టలు లెక్కించగా... ఇప్పటివరకు రూ.353 కోట్ల లెక్క తేలిందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఓ దర్యాప్తు సంస్థ చేపట్టిన సోదాల్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు పట్టుబడటం దేశంలో ఇదే తొలిసారి. దీనిపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్వర్యంలో పార్లమెంట్ బయట పార్టీ ఎంపీలు నిరసన చేపట్టారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వివరణ ఇవ్వాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జేపీ నడ్డా మీడియాతో మాట్లాడుతూ 'కాంగ్రెస్, కరప్షన్ ఒకే నాణానికి రెండు ముఖాలు లాంటివి. ధీరజ్ సాహు వద్ద దొరికిన ఈ నల్లడబ్బు ఎవరిది? దీనిపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సమాధానం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. భారీ స్థాయిలో నగదు వెలుగులోకి రావడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక ఎంపీ ఇంటినుంచి ఈ స్థాయిలో నగదు స్వాధీనం చేసుకున్నారు. కానీ దీనిపై ప్రతిపక్షాల ఇండియా కూటమి మాత్రం మౌనం వహిస్తోంది. అవినీతి అనేది కాంగ్రెస్ స్వభావం కాబట్టి ఆ పార్టీ నిశ్శబ్దంగా ఉండటం సహజమే. కానీ జేడీయూ, ఆర్జేడీ, డీఎంకే, ఎస్పీ ఎందుకు మౌనం వహిస్తున్నాయి' అని ఇండియా కూటమిపై విమర్శలు గుప్పించారు. డబ్బు లెక్కింపు దాదాపుగా పూర్తికావొచ్చిందని ఐటీ శాఖ అధికారులు తెలిపారు. బొలంగిర్‌లోని ఎస్‌బీఐ శాఖలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయనున్నారు. మొత్తం 176 బ్యాగుల్లో 140కి పైగా బ్యాగుల్లోని నగదు లెక్కింపు పూర్తయిందని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ తెలిపారు. ఇదిలా ఉంటే.. గతంలో అవినీతికి వ్యతిరేకంగా ధీరజ్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. 'డీమానిటైజేషన్ తర్వాత కూడా దేశంలో నల్లధనం, అవినీతిని చూస్తుంటే నా హృదయం బరువెక్కుతోంది. అంత నల్లడబ్బు ఎలా ఒకదగ్గర పోగుపడుతుందో నాకర్థం కావడం లేదు. ఈ దేశంలో అవినీతిని పారదోలేది కాంగ్రెస్ మాత్రమే' అని అప్పట్లో ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ఎంపీ పోస్టును బీజేపీ నేత అమిత్ మాలవీయ రీట్వీట్ చేశారు. ధీరజ్ ప్రసాద్ సాహుకు మంచి హాస్య చతురత ఉందని ఎద్దేవా చేశారు.

రుణమాఫీ ప్రకటనలు నమ్మొద్దు: ఆర్‌బీఐ

ముంబై: రుణమాఫీ ఆఫర్ల పేరుతో వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు నమ్మి మోసపోవద్దని ప్రజలను భారతీయ రిజర్వు బ్యాంకు సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించింది. రుణాలు తీసుకుంటే అవి మాఫీ అవుతాయని ప్రచారం చేస్తూ కొన్ని సంస్థలు వినియోగదారులను మభ్యపెడుతున్నాయని, ఈ ప్రకటనలు ఆర్‌బీఐ దృష్టికి రావడంతో వాటిని నమ్మొద్దని వినియోగదారులను హెచ్చరించింది. రుణమాఫీ ఆఫర్ల పేరుతో కొన్ని సంస్థలు వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సర్వీస్/చట్టపరమైన రుసుము పేరుతో నగదు వసూలు చేసి రుణమాఫీ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నాయి. ఇందుకు ఆయా సంస్థలకు ఎలాంటి అనుమతి లేదు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలను కొందరు వ్యక్తులు, సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. దాంతోపాటు బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు రుణ మొత్తం తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని వినియోగదారులకు చెబుతున్నాయి. ఇలాంటి ప్రచారం ఆర్థిక సంస్థల స్థిరత్వాన్ని, డిపాజిటర్ల ప్రయోజనాలను దెబ్బతీస్తుంది. అలాంటి సంస్థలతో సంబంధాలు కలిగి ఉండటం ఆర్థికపరమైన నష్టాలకు దారి తీస్తుంది. ఇలాంటి ప్రకటనలను వినియోగదారులు నమ్మొద్దు. వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆర్‌బీఐ ప్రకటనలో పేర్కొంది.

తీవ్ర నిరాశ...నిస్పృహ

సుప్రీం తీర్పుపై కశ్మీర్ పార్టీల ఆగ్రహం

శ్రీనగర్/జమ్ము: ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు విపక్షాలకు ఆగ్రహం కలిగించగా అధికారపక్షానికి సంతోషం పెంచింది. సుప్రీంకోర్టు తీర్పుపై కశ్మీర్ పార్టీలు తీవ్ర నిరాశ వ్యక్తం చేశాయి. బీజేపీ, ఆ పార్టీని బలపర్చే శక్తులు సమర్థించాయి. జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, డెమొక్రటిక్ ప్రొగ్రెసివ్ ఆజాద్ పార్టీ (డీపీఏపీ) అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్ స్పందిస్తూ... ఈ తీర్పు బాధాకరం, దురదృష్టకరమన్నారు. ఈ తీర్పుతో కశ్మీరీ ప్రజలు సంతోషించరని తెలిపారు. కశ్మీర్ ప్రజల మనోభావాలు, ఆర్టికల్ 370 చారిత్రక ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకోకపోవడంపై ఆయన నిరాశ వ్యక్తం చేశారు. కానీ ఈ తీర్పును అంగీకరించాల్సిందేనని వివరించారు.

జమ్ము కశ్మీర్ ప్రజలు తమ ఆశను కోల్పోరని, రాజీ పడబోరని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ తెలిపారు. గౌరవం, ఆత్మాభిమానం కోసం చేసే తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ తీర్పుతో తమ మార్గం ముగిసిపోయిందని అనుకోవద్దని స్పష్టం చేశారు. ఇది భారత్ అనే ఆలోచనకు మరణశిక్ష వంటిదని అభివర్ణించారు. జమ్ము కశ్మీర్ సంస్థానాన్ని పాలించిన మహారాజ హరిసింగ్ కుమారుడు, కాంగ్రెస్ నేత కరణ్ సింగ్ మాట్లాడుతూ... ఈ తీర్పుపై అసంతృప్తితో ఉన్న జమ్ము కశ్మీర్‌లోని కొందరు... అనివార్యమైన ఈ తీర్పును అంగీకరించాల్సిందేనని కోరుతున్నట్లు తెలిపారు. ఇది జరిగిపోయిందనే వాస్తవాన్ని జీర్ణించుకోవాలని వివరించారు. ఆ చర్యలను సుప్రీంకోర్టు సమర్థించిందని, కాబట్టి, తలను గోడకేసి బాదుకోవడం వల్ల ఒనగూరేదేమీ లేదని అన్నారు.

- నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు, జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ ఈ తీర్పు నిరాశ పరిచిందన్నారు. కానీ, తనలోని ఆత్మస్థైర్యాన్ని తగ్గించలేదని పేర్కొన్నారు. తమ పోరాటం కొనసాగుతుందని వివరించారు. బీజేపీ ఈ స్థాయికి చేరుకోవడానికి కొన్ని దశాబ్దాల కాలం పట్టిందని, తాము కూడా సుదీర్ఘ ప్రయాణానికి సిద్ధమవుతున్నామని చెప్పారు.

- జమ్ముకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్ రైనా సుప్రీం తీర్పును స్వాగతించారు. అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించి, జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి కేంద్రం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. 'మేము మన దేశం, రాజ్యాంగం, న్యాయవ్యవస్థను చూసి గర్విస్తున్నాము. మేము సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తాము' అని పీటీఐకి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు కేంద్రం సిద్ధంగా ఉందని, అయితే ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన అన్నారు. తీర్పుకు రాజకీయ రంగు పులమకపోవడమే మంచిదని జమ్ముకశ్మీర్ ముఖ్య అధికార ప్రతినిధి సునీల్ సేథీ అన్నారు. సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని సమర్థించారు.
- పీపుల్స్ కాన్ఫరెన్స్ అధినేత సజ్జాద్ లోనె స్పందిస్తూ... సుప్రీం తీర్పు నిరాశపరిచిందన్నారు. ఆర్టికల్ 370 చట్టబద్ధంగా తొలగించబడినప్పటికీ, అది వారి రాజకీయ ఆకాంక్షలలో భాగంగానే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నిర్వాసితులైన కశ్మీర్ పండిట్లు సుప్రీం నిర్ణయాన్ని స్వాగతించారు, ఆర్టికల్ 370ని రద్దు చేయడం చారిత్రాత్మక తీర్పుగా పేర్కొన్నారు.
- 'ఈ తీర్పు ఆర్టికల్ 370 చుట్టూ ఉన్న అన్ని వివాదాలకు స్వస్తి పలికింది. ఈ నిర్ణయం పట్ల మేము సంతోషిస్తున్నాము' అని పనున్ కశ్మీర్ చైర్మన్ డాక్టర్ అజయ్ ఛ్రుంగూ పీటీఐకి చెప్పారు.

కశ్మీర్ లోయలో భద్రత కట్టుదిట్టం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 370' రద్దుపై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించడానికి ముందు కశ్మీర్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలగకుండా అనేక చోట్ల భద్రతా బలగాలను మోహరించారు. శ్రీనగర్ చుట్టుపక్కల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను, పౌరులను తనిఖీ చేశారు. కశ్మీర్‌లోని ఇతర జిల్లాల్లో కూడా కొన్ని చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే, లోయలో ఎక్కడా ప్రజల రాకపోకలపై ఎటువంటి ఆంక్షలు లేవని అధికారులు తెలిపారు. ప్రజల దైనందన జీవితం సాధారంగా ఉంది. దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు ఉదయం యథావిధిగా తెరుచుకున్నాయి. ఎక్కడా ఎటువంటి ఆంక్షలు విధించలేదని అధికారులు పేర్కొన్నారు. పరిస్థితిని భద్రతా సంస్థలు నిశితంగా పరిశీలిస్తున్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు తెలిపారు. సామాజిక మాధ్యమాలను సంబంధిత ఖాతాదారులు బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, పుకార్లు, నకిలీ వార్తలు, ద్వేషపూరిత ప్రసంగాలు లేదా అశ్లీల, హింసాత్మక, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యానాలను పంచుకోవద్దని కశ్మీర్‌లో సైబర్ పోలీసులు హెచ్చరించారు. అసలు వాస్తవాలను ధృవీకరించకుండా ఇతర వినియోగదారుల నుండి వచ్చిన ఏదైనా నేరపూరిత సమాచారాన్ని వ్యాపింప చేయకుండా ... దాని గురించి వెంటనే సైబర్ పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ముందుజాగ్రత్త చర్యగా సోమవారం ఎలాంటి కాన్వాయ్ లను నగరంలో అనుమతించడంలేదు.

సిద్ధరామయ్య సర్కార్ కూలిపోవచ్చు

కుమారస్వామి వ్యాఖ్య

బెంగళూరు: కర్నాటకలోని కాంగ్రెస్ సర్కార్ ఏ క్షణమైనా కూలిపోవచ్చని జనతాదళ్ సెక్యులర్ అధ్యక్షుడు హెచ్ డీ కుమార్‌స్వామి చెప్పుకొచ్చారు. సోమవారం ఆయన బెంగళూరులో మాట్లాడుతూ సిద్ధరామయ్య సర్కార్ పనితీరు బాగాలేదన్నారు. ఒక మంత్రి తన వెంట 50-60 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుని బీజేపీలో చేరే అవకాశం ఉంది. తద్వారా ప్రభుత్వం కూలిపోతుంది. అందరిలో విధేయత, నిజాయతీ కనిపించడం లేదు. రాష్ట్రంలో 6 నెలలుగా అభివృద్ధి జరగట్లేదు. ప్రజల్లో అసంతృప్తి పెరిగిపోయిందని కుమారస్వామి అన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం: శివసేన

న్యూదిల్లీ: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు అంశంపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును తాము స్వాగతిస్తున్నామని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం) ఎంపీ సంజయ్ రౌత్ చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన బిల్లు పార్లమెంటు ముందుకు వచ్చినప్పుడు కూడా తాము మద్దతు పలికామని ఆయన తెలిపారు. అదేవిధంగా జమ్ముకశ్మీర్‌లో తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు చెప్పిందని, ఆ నిర్ణయాన్ని కూడా తాము స్వాగతిస్తున్నామని ఎంపీ సంజయ్ రౌత్ చెప్పారు. అక్కడి ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకునే సర్వ హక్కులు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, ఆర్టికల్ 370 రద్దుపై ఇవాళ కేంద్రం వినిపించిన వాదనలను సుప్రీంకోర్టు సమర్థించింది. ఆర్టికల్ 370 అనేది తాత్కాలిక నిబంధన మాత్రమేనని, శాశ్వతం కాదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వ ంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం తమ నిర్ణయాన్ని ప్రకటించింది. రాజ్యా ంగబద్ధంగానే ఆర్టికల్ 370 రద్దు జరిగిందని తెలిపింది. ఆర్టికల్ 370 రద్దు వెనుక ఎలాంటి దురు ద్దేశం కనిపించడం లేదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని 2019 ఆగస్టు 5న కేంద్రం రద్దు చేసింది.

68 లక్షల మంది ప్రభుత్వ పెన్షనర్లు: కేంద్రం

న్యూదిల్లీ: ఈ ఏడాది మార్చి 31 నాటికి రక్షణరంగ సిబ్బంది సహా కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు 67.95 లక్షలమంది ఉన్నట్లు ఆర్థికమంత్రిత్వశాఖ సోమవారం వెల్లడించింది. సెంట్రల్ పెన్షన్ అకౌంటింగ్ ఆఫీస్, కంట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్సు, మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, డిపార్టుమెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ అండ్ డిపార్టుమెంటు ఆఫ్ పోస్టు లెక్కల ఆధారంగా డిపార్టుమెంటు ఆఫ్ పెన్షన్ అండ్ పెన్షనర్స్ వెల్ఫేర్ ఈ డేటా ప్రకటించినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపారు. మొత్తం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఖ్య 67,95,449 ఉన్నట్లు చెప్పారు. సివిల్, డిఫెన్స్ పెన్షనర్లు 11.42 లక్షల మంది, 33.87 లక్షల మంది ఉన్నారు. టెలికాం, పోస్టల్ పెన్షనర్లు 4.38 లక్షలు, 3.01 లక్షల మంది ఉన్నారు. రైల్వే పెన్షనర్లు 15.25 లక్షల మంది ఉన్నట్లు కేంద్రమంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం(ఓపీఎస్) పునరుద్ధరించే అవకాశం ఉందా అని అడుగగా అలాంటి ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని స్పష్టంచేశారు.

జావెద్ అక్తర్‌కు పద్మపాణి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ముంబై: ప్రముఖ పాటల రచయిత జావెద్ అక్తర్‌కు పద్మపాణి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. అజంతా ఎల్లోరా చిత్రోత్సవాల్లో ఈ అవార్డును అక్తర్‌కు ప్రదానం చేస్తారు. జంజీర్, దీవార్, షోలే, డాన్, కాలాపత్తర్, మిస్టర్ ఇండియా వంటి ప్రజాదరణ పొందిన హిందీ సినిమాలకు అక్తర్ సహ రచయితగా పనిచేశారు. భారత చలనచిత్ర పరిశ్రమకు అక్తర్ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. జనవరి 3వ తేదీన ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఎంజీఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో అవార్డు కార్యక్రమం జరుగుతుంది. అజంతా ఎల్లోరా ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణ కమిటీ చైర్మన్ నందకిశోర్ కగ్లీవాల్ ఈ మేరకు ప్రకటన చేశారు. అవార్డు కింద అక్తర్‌కు పద్మపాణి మెమొంటో, ప్రశంసాపత్రం, రెండు లక్షల రూపాయల నగదు అందజేస్తారు.

శివ రాజ్‌కుమార్‌కు ఎంపీ టికెట్: డీకే

బెంగళూరు: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయంతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ... వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. రాష్ట్రంలో అన్ని వర్గాల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రముఖ కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్‌కు బహిరంగంగా ఓ ఆఫర్ చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలని ఈ స్టార్ హీరోను కోరారు. బెంగళూరులో ఆదివారం ఆర్యా ఈడిగ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. ఈడిగ సామాజిక వర్గానికి చెందిన శివ రాజ్‌కుమార్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీకే మాట్లాడుతూ.. 'వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని శివ రాజ్‌కుమార్‌ను కోరా. కానీ, ఆయన చాలా సినిమా షూటింగ్‌లు పూర్తిచేయాల్సి ఉందన్నారు. ఆయనకు నేను చెప్పేది ఒకటే.. సినిమాలు ఎప్పుడు కావాలంటే అప్పుడు చేసుకోవచ్చు. కానీ, పార్లమెంట్‌కు వెళ్లే గొప్ప అవకాశం అందరికీ రాదు. మీ తలుపుతట్టిన అవకాశాన్ని మీరు వదులుకోవద్దు. మా ఆఫర్‌ను ఒకసారి పరిశీలించండి' అని నటుడిని కోరారు. అయితే, డీకే మాటలకు ఆ కార్యక్రమంలో స్పందించని శివ రాజ్‌కుమార్ ఆ తర్వాత దీని గురించి డిప్యూటీ సీఎంతో చర్చించినట్లు సమాచారం. లోక్‌సభ ఆఫర్‌ను ఆయన చాలా సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. 'ముఖానికి రంగులద్దుకుని నటించి ప్రేక్షకులను మెప్పించడం అనేది నా తండ్రి నాకిచ్చిన బహుమతి. ప్రత్యక్ష రాజకీయాలకు మా కుటుంబం దూరంగా ఉంటుంది. రాజకీయాలతో నాకున్న ఏకైక సంబంధం.. నేను గీత (మాజీ సీఎం బంగారప్ప కుమార్తె)ను వివాహం చేసుకోవడమే. ఆమెకు రాజకీయాలపై ఆసక్తి ఉంది. ఓ భర్తగా ఆమె ఆశయాలను నేను ప్రోత్సహిస్తాను. ఆమెకు మీరు టికెట్ ఇచ్చే అంశాన్ని పరిశీలించవచ్చు 'అని శివరాజ్‌కుమార్ డిప్యూటీ సీఎంకు చెప్పినట్లు వివిధ మీడియా కథనాలు వెల్లడించాయి. గీత ఇప్పటికే ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. 2014లో ఆమె మాజీ సీఎం యడియూరప్పపై జేడీఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

ఉల్లి ఎగుమతులపై నిషేధం వద్దు: పవార్

నాసిక్: ఉల్లి ఎగుమతులపై కేంద్రం ఇటీవల విధించిన నిషేధాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ డిమాండ్ చేశారు. రైతు కష్టాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని నాసిక్‌లో జిల్లాలోని చంద్వాడ్ గ్రామానికి చెందిన ఉల్లి రైతులు చేపట్టిన నిరసనలో శరద్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవార్ మాట్లాడుతూ రైతులంతా ఏకమై తమ హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఉల్లి రైతులు మంచి పంట కోసం శ్రమించే చిన్న రైతులని, తాను కేంద్ర వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో ఉల్లి ధరలను ఎప్పుడూ తగ్గించలేదని చెప్పారు. ఎగుమతులనూ నిషేధించలేదన్నారు. ఉల్లి ఎగుమతులపై విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కు తీసుకోవాలని పవార్ కోరారు. ద్రాక్షపై రూ.160 మేర బంగ్లాదేశ్ దిగుమతి సుంకం విధిస్తూ నిర్ణయం తీసుకుందన్న పవార్...ఆ నిర్ణయంతో ద్రాక్ష ఉత్పత్తిదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. దేశీయంగా లభ్యతను పెంచడంతో పాటు ధరలను అదుపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఉల్లిపాయల ఎగుమతులపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మహారాష్ట్రలోని అనేకచోట్ల ఉల్లి రైతులు నిరసనలకు దిగారు.

ఆర్టికల్ 370 రద్దు నుంచి...



న్యూదిల్లీ: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 370' రద్దు రాజ్యాంగబద్ధమేనని భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆర్టికల్ 370 రద్దుపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోపు జమ్ముకశ్మీరు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 2019లో ఆర్టికల్ 370 రద్దు మొదలుకొని...ఆ తర్వాత జరిగిన పరిణామాలను వరుసగా ఓసారి పరిశీలిస్తే..

- డిసెంబర్ 20, 2018: జమ్ముకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధింపు. జులై 3, 2019న దాన్ని మరోసారి పొడిగించారు.
- ఆగస్టు 5, 2019: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- ఆగస్టు 6, 2019: ఆర్టికల్ 370 రద్దు చేస్తూ రాష్ట్రపతి ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఎంఎల్ మిశ్రా అనే న్యాయవాది సుప్రీంకోర్టులో తొలి పిటిషన్ దాఖలు చేశారు. కొంతకాలానికి జమ్ము కశ్మీర్‌కు చెందిన మరో న్యాయవాది షకీర్ షబీర్ మరో పిటిషన్ వేశారు.
- ఆగస్టు 10, 2019: స్థానిక పౌరుల ఆమోదం లేకుండా రాష్ట్ర హోదాను మార్చారని పేర్కొంటూ జమ్ము కశ్మీర్‌లో ప్రధాన రాజకీయ పార్టీగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) పిటిషన్ దాఖలు చేసింది.
- ఆగస్టు 28, 2019: జర్నలిస్టులపై ఆంక్షలు తొలగించాలని కోరుతూ కశ్మీర్ టైమ్స్ ఎడిటర్ చేసిన విజ్ఞప్తిపై కేంద్రంతోపాటు జమ్ముకశ్మీర్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది.
- ఆగస్టు 28, 2019: ఈ అంశాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం సిఫార్సు చేసింది.
- సెప్టెంబర్ 19, 2019: ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది.
- మార్చి 2, 2020: ఆర్టికల్ 370 రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన అనేక పిటిషన్లను ఏడుగురు సభ్యుల ధర్మాసనానికి సిఫార్సు చేసేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది.
- ఏప్రిల్ 25, 2022: జమ్ముకశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ కోసం జరుగుతోన్న కసరత్తుపై తక్షణమే విచారణ జరపాలని పిటిషన్ దాఖలైంది. ఈ క్రమంలోనే ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లపై వేసవి సెలవుల తర్వాత విచారిస్తామని సుప్రీం కోర్టు తెలిపింది.
- జులై 11, 2023: ఆగస్టు 2 నుంచి రోజువారీ విచారణ ప్రారంభిస్తామని సుప్రీం కోర్టు వెల్లడించింది.
- ఆగస్టు 2, 2023: ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం ధర్మాసనం విచారణ మొదలుపెట్టింది.
- సెప్టెంబర్ 5, 2023: దీనిపై దాఖలైన 23 పిటిషన్లపై 16 రోజులు విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తీర్పు రిజర్వు చేసింది.
- డిసెంబర్ 11, 2023: ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనదేనని తెలిపింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది.

రాజేంద్రన్ మృతి తీరని లోటు

నివాళి అర్పించిన నారాయణ, అజీజ్‌పాషా

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ అకాల మృతి పార్టీకి, ఇతర వామపక్ష, లౌకిక శక్తులకు తీరనిలోటని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. హైదరాబాదులోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో రాజేంద్రన్ చిత్రపటానికి నారాయణతోపాటు సీపీఐ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేశ్ సోమవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నారాయణ ప్రసంగిస్తూ రాజేంద్రన్ శుక్రవారం గుండెపోటుతో మరణించారని తెలిపారు. సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీలో పని చేశారన్నారు. రాజేంద్రన్ 2015 నుండి వరుసగా మూడు పర్యాయాలు కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. రాజేంద్రన్ మృతి పట్ల వామపక్ష, లౌకిక పార్టీలకు తీరని లోటని పేర్కొంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, ఆఫీసు సిబ్బంది గోవిందు, దశరథ తదితరులు పాల్గొన్నారు.

విచారకరం: నారాయణ

జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేయడాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం విచారకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. 370 ఆర్టికల్ రద్దు అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. దీనిని సుప్రీంకోర్టు సమర్థించడమంటే బీజేపీ దుష్ట విధానానికి వంతపాటడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ వ్యతిరేక చర్య మాత్రమే కాకుండా జమ్మూ-కశ్మీర్ ప్రజలకు ఇచ్చిన హామీల ఉల్లంఘన అని వ్యాఖ్యానించారు. 370 ఆర్టికల్ రద్దు చేయడం లౌకిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమేనని, సుప్రీంకోర్టు కాపాడుతుందని భావించామని, కానీ అలా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సమగ్రతను కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా పేర్కొన్నారు. ఆర్టికల్ 370ని కాపాడి దేశ సమగ్రత, సమైక్యత, లౌకిక వ్యవస్థను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

నేటినుంచి తపాల ఉద్యోగుల సమ్మె... ఏఐటీయూసీ మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల12వ తేదీ నుంచి గ్రామీణ తపాల ఉద్యోగులు చేయ తలపెట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలేష్ చంద్ర కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలని, గ్రామీణ డాక్ సేవకులకు ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, ఏడో వేతన కమిటీలో అమలుకు నోచుకోని అన్ని డిమాండ్లను అమలు చేయాలని, పని భారం తగ్గించి అదనపు సర్వీసు, ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలు తంతి తపాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారం చేయాలని ఆయన కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసనలు తెలియటం జరిగిందని, మంత్రులు కూడా అనేక సార్లు చర్చించారని, కొన్ని పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అన్ని హామీలు బుట్ట దాఖలు చేసినందున అనివార్య పరిస్థితులలో గ్రామీణ తంతి తపాల ఉద్యోగులు నిరవధిక సమ్మెకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. సమ్మె వల్ల జరిగే పరిణామాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని రవీంద్రనాథ్ హెచ్చరించారు.

23 నుంచి 'నంది నాటకోత్సవాలు'

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగు నాటకానికి పండుగ లాంటి నంది నాటకోత్సవాలను డిసెంబర్ 23 నుంచి 29 వరకు వారం రోజుల పాటు ప్రతిష్మాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ మొదటి అంతస్తులోని ఆర్టీసీ కాన్ఫరెన్స్‌హాల్ లో నంది అవార్డుల తుది పోటీల న్యాయనిర్ణేతల సమక్షంలో '22వ నంది నాటకోత్సవం -2022' వివరాలను పోసాని కృష్ణమురళి మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నందినాటకోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ ప్రాంగణానికి సత్య హరిశ్చంద్ర నాటక రచయిత, స్వాతంత్ర్య సమరయోధులు బలిజేపల్లి లక్ష్మీకాంతం పేరు పెట్టినట్లు చెప్పారు. నంది నాటకోత్సవాల్లో భాగంగా 115 ప్రదర్శనలకు గాను రాష్ట్రం నలుమూలల నుండి పద్య, సాంఘిక నాటకాలు, సాంఘిక నాటికలు, బాలల నాటిక, కళాశాల లేదా యూనివర్సిటీ నాటిక (ప్లేలెట్స్) అనే ఐదు విభాగాల్లో ఎంపిక చేసిన 38 నాటక సమాజాలు పాల్గొంటున్నాయన్నారు.

ఆయా విభాగాల్లో కలిపి మొత్తం 74 అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. మూడు న్యాయనిర్ణేతల బృందాలు పోటీల్లో పాల్గొనడానికి ముందుకు వచ్చిన నాటక సమాజాల వద్దకు వెళ్లి వాళ్ల ప్రదర్శనలు తిలకించి ఎంపిక చేశాయన్నారు. వారం రోజుల పోటీల్లో తుది ఎంపిక కోసం సంబంధిత సమాజాలు సంస్థ చైర్మన్ సమక్షంలో జరిగిన 'లాటరీ'లో పాల్గొన్న అనంతరం ప్రదర్శనల షెడ్యూలును సంస్థ ఖరారు చేసిందన్నారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుండి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు జరుగుతాయని పోసాని తెలిపారు. 5 విభాగాలలో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు తుది ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని పోసాని తెలిపారు. అవార్డులు ప్రదానం చేస్తున్న ఏడాది (2022)కి గాను నాటక రంగంపై వెలువడిన ఉత్తమ రచన గ్రంథం ఎంపిక కోసం మరో ముగ్గురితో వేరొక కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ

ఎంప్లాయీస్ యూనియన్ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ(పీటీడీ) ఉద్యోగుల పెండింగు అప్పీళ్లు, కేసుల పరిష్కానికి,1026 మంది ఉద్యోగుల పదోన్నతులపై ఈ వారంలోనే సర్క్యులర్ల జారీకి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు హామీ ఇవ్వడం పట్ల ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2022 మేలో కొంత మంది హైకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న అప్పీల్, సస్పెండ్ కేసుల పరిష్కారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్‌గా అటు ప్రభుత్వం వద్ద, ఇటు ఆర్టీసి యాజమాన్యానికి చేసిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందన్నారు. దీనిపై డ్రాఫ్ట్ సర్క్యులర్‌ను న్యాయపర అంశం కోసం పంపించామని, అది వచ్చిన వెంటనే ఈ వారంలోనే సర్క్యులర్ ఇస్తామని ఎండీ హామీ ఇచ్చారన్నారు. ఆర్టీసీ (పీటీడీ)ఉద్యోగులకు పాత విద్యార్హతలపై అన్ని కేటగిరుల ఉద్యోగులకు పదోన్నతులు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1026 ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎండీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బదిలీల వినతులను పరిష్కరించాలని యూనియన్ కోరగా, వాటిపైన ఈ వారంలోనే ఇస్తామని, బకాయిల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ అధికారులు భరోసా ఇచ్చారని యూనియన్ నేతలు తెలిపారు.

ప్రజలను పోరాటాల వైపు మళ్లించాలి

పార్టీ శ్రేణులకు సీపీఐ నేత జల్లి విల్సన్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ప్రజల దైనందిన సమస్యల పరిష్కారానికి గ్రామ శాఖలు క్షేత్రస్థాయిలో ఉత్సాహంగా పనిచేసి ప్రజలను పోరాటాల వైపు మళ్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. సీపీఐ బాపట్ల జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా విస్తృత సమితి సమావేశం జిల్లా నాయకులు బత్తుల శ్యాముల్ అధ్యక్షతన జరిగింది. సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు జేబీ శ్రీధర్ తొలుత సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ కేంద్రలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా సమస్యలు గాలికి వదిలేసి కుల మతాల మధ్య చిచ్చు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని విమర్శించారు. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా తిరోగమనంలో ఉందన్నారు. మోదీని గద్దె దించటమే లక్ష్యంగా దేశంలో ఉన్న ప్రతి పౌరుడు నడుం బిగించాలని విల్సన్ తెలిపారు. మోదీ చేతిలో దేశం ఉంటే అప్పుల్లో ఉండి అన్నీ రంగాలు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెపుతూ ప్రజా సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. మోదీ నుంచి దేశాన్ని విముక్తి చేసుకోవాల్సిన బాధ్యత అన్నీ పార్టీలు, ప్రజా సంఘాలపై ఉందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ కార్యక్రమాలపై పెడుతున్న శ్రద్ధ అభివృద్ధిపై కూడా పెట్టాలని సూచించారు. తుపాను దాటికి నష్టపోయిన కౌలు రైతులకు మాత్రమే పరిహారం ఇచ్చే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వ్యవసాయాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. తుపాను దాటికి జిల్లాలో నెలకొన్న పరిస్థితులు, జరిగిన నష్టం, కరువుపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఈ నెల 14వ తేదీన ధర్నా చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 26వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి శాఖలో సీపీఐ జెండాలను ఎగరవేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ మహాసభలు బాపట్ల వేదిక జరుగగా విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ 2024 సభ్యత్వ నమోదు, పునరుద్దరణ త్వరితగతిన చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు షేక్ కాలేషాగారి ఖాదార్ బాషా, చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాశ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ జె. రత్నకుమారి, కోలా వీరాజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు త్రిపుర కృష్ణారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు పాదిలి శ్రీమన్నారాయణ,షేక్ సుభాని, పొట్లూరి రామాంజమ్మ, చీదర్ల కొండయ్య, సన్నమూరి శ్రీనివాసరావు, మల్లవరపు రమణ, దుర్గాప్రసాద్, శివ, మెగిలి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

మూడువేల కిలోమీటర్లకు లోకేశ్ పాదయాత్ర

పైలాన్ ఆవిష్కరించిన లోకేశ్

విశాలాంధ్ర - కాకినాడ/అన్నవరం: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మూడువేల కిలోమీటర్ల పాదయాత్రకు గుర్తుగా తునిలోని యనమల గెస్ట్‌హౌస్ వద్ద పైలాన్‌ను ఆవిష్కరించారు. తన సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్ సమక్షంలో లోకేశ్ పైలాన్‌ను ఆవిష్కరించారు. ఆదివారం తొండంగి మండలం శృంగ వృక్షం మీదుగా పాదయాత్ర కొనసాగి తేటగుంట సమీపంలో రాత్రి బసచేశారు. సోమవారం ఉదయం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య, ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ, యనమల కృష్ణుడు, రామచంద్రరావు, వనమాడి కొండ బాబు, రెడ్డి సుబ్రమణ్యం, బండారు సత్యానందరావు, గొల్లపల్లి సూర్యారావు యనమలతో కలిసి టీడీపీ నాయకులు పాదయాత్రలో పాల్గొన్నారు. నారా లోకేశ్ మాట్లాడుతూ సైకో జగన్ రాష్ట్రంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు, మూడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచారని, ఆరు లక్షల మందికి పెన్షన్ రద్దు చేశాడని విమర్శించారు. అలాంటి వ్యక్తిని అధికారం నుంచి దించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

కాపుల కోసం కాపుకాస్తా

విశాలాంధ్ర-అన్నవరం: టీడీపీ-జనసేన ప్రభుత్వం కాపులకు అండగా ఉంటుందని లోకేశ్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ అడ్డంకులను అధిగమిస్తూ తనపాదయాత్ర కొనసాగించానని చెప్పారు. వైసీపీ సర్కారు మూసేసిన అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తునిలో సోమవారం కాపు యువతతో ముఖాముఖి భేటీ అయ్యారు. లోకేశ్‌కు ఘనస్వాగతం లభించింది. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్, బావమరిది మోక్షజ్ఞ హుషారుగా పాదయాత్రలో పాల్గొన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌కు ఎస్టీయూ షోకాజ్ నోటీస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న లక్షా 80 వేల మంది ఉపాధ్యాయులకు నాలుగేళ్లుగా ఆర్థిక బకాయిలు చెల్లించనందున, మీ కార్యాలయం ముందు ఎందుకు ఆందోళన చేయకూడదో తెలియ జేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె.సురేశ్ కుమార్‌కు షో కాజ్ ఇచ్చినట్లు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్న తెలిపారు. సోమవారం అమరావతిలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో సురేశ్ కుమార్‌ను ఎస్టీయూ నేతలు కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి షో కాజ్ నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ చిన్న చిన్న కారణాలతో షోకాజ్ నోటీసులు, ఛార్జ్‌మెమోలు జారీ చేస్తున్నా రని, అంత మాత్రమే కాక సామాజిక మాధ్య మాలలో ఉపాధ్యాయులను కించపరిచే విధంగా ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. నాలుగేళ్లుగా ఉపాధ్యాయులకు సంబంధించిన 11వ పీఆర్సీ, కరువు భత్యం, జీవిత బీమా, ఆర్జిత సెలవు, చివరకు ఉపాధ్యాయులు దాచుకున్న టువంటి భవిష్య నిధి చెల్లింపులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఈ మొత్తం వెరసి దాదాపు రూ. 30 వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా ఉపాధ్యాయులను, ఉద్యోగులను, మానసికంగా వేధింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 11 వ తేదీన వచ్చినప్పటికీ నవంబరు వేతనాలు ఇంకా అందలేదన్నారు. రెండు సంవత్సరాలుగా ఉపాధ్యా యుల ఆర్జిత సెలవు బకాయిలు దాదాపు రూ. 800 కోట్లు పెండింగ్ ఉన్నాయని, దీనికి సంబంధించి ఆదాయ పన్ను మినహాయింపు చెల్లించామని తెలియజేశారు. జీవిత బీమా పథకం కింద చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు కూడా చెల్లింపులు చేయకపో వడం అత్యంత బాధాకర మన్నారు. ఇప్పటికైనా పెండింగ్ ఉన్నటువంటి ఆర్థిక బకాయిలన్నీ తక్షణం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో జరగబోయే ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ ను కలిసిన వారిలో కృష్ణాజిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేల్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ ఉన్నారు.

యువకుడితో కలిసి పారిపోయిన అమ్మాయి

తల్లిని కట్టేసి చిత్రహింసలు

బెంగళూరు: ఒక యువ జంట తమ ఇళ్ల నుంచి పారిపోయారు. ఆగ్రహించిన యువతి కుటుంబం యువకుడి ఇంటికి వెళ్లారు. అతడి తల్లిని బయటకు ఈడ్చుకొచ్చి బట్టలు విప్పించి, స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టారు. కర్నాటకలోని బెళగావిలో ఈ ఘటన జరిగింది. ఒక మహిళ కుమారుడితో ఒక అమ్మాయి పారిపోవడంపై ఆమె కుటుంబ సభ్యులు రెచ్చిపోయారు. ఆదివారం రాత్రి వేళ ఆ మహిళ ఇంటికి వెళ్లారు. ఆమెను ఇంటి నుంచి బయటకు ఈడ్చుకొచ్చారు. దుస్తులు విప్పించి నగ్నంగా మార్చారు. ఒక పోల్‌కు కట్టేసి దారుణంగా కొట్టారు. కాగా, ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు స్పందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. యువకుడి తల్లిని కాపాడారు. ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడి చేసిన యువతి కుటుంబానికి చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కర్నాటక సీఎం సిద్ధరామయ్య ఈ ఘటనపై స్పందించారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ఎక్కడ జరిగినా సహించబోమని హెచ్చరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కర్నాటక హోం మంత్రి పరమేశ్వర కూడా ఈ ఘటనపై స్పందించారు. ఇప్పటికే ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారని తెలిపారు. బాధిత మహిళకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు.

విపక్ష రాష్ట్రాలపై కేంద్రం వివక్ష

మండిపడిన ఇండియా ఎంపీలు రాజ్యసభ నుంచి వాకౌట్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు మోదీ సర్కారు నిధులు నిలిపివేస్తోందని విపక్ష ఇండియా కూటమి ఎంపీలు తీవ్రంగా విమర్శించారు. కేంద్రం సర్కారు తీరును నిరసిస్తూ రాజ్యసభను సోమవారం స్తంభింపచేశారు. ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలపై వివక్షను విడనాడాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఖరికి నిరసనగా రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ఉదయం సభ సమావేశం కాగానే ప్రతిపక్షాల ఎంపీలు నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆప్, సమాజ్‌వాదీ పార్టీ, జనతాదళ్(యు), డీఎంకే, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ), నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ), సీపీఐ, సీపీఎం, శివసేన(ఉద్ధవ్) తదితర పార్టీలు ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేపీయేతర పార్టీల నాయకత్వంలోని ప్రభుత్వాలకు కేంద్రం నిధులు నిలిపివేతకు నిరసనగా ప్రతిపక్ష పార్టీల ఎంపీలంతా రాజ్యసభ నుంచి వాకౌట్ చేసినట్లు టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ చెప్పారు.

అంతా వారి భ్రమ: సిద్ధరామయ్య

బెలగావి: కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీజేపీ, జేడీ(ఎస్) భ్రమపడుతున్నాయని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. కుమారస్వామి వ్యాఖ్యలపై సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందనేది కుమారస్వామి భ్రమ అని సీఎం చెప్పారు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీజేపీ, జేడీఎస్ నాయకులు... నీళ్లు లేని బావిలో చేపల మాదిరిగా విలవిలలాడిపోతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, జేడీఎస్ కలిసి 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పై పోరాడేందుకు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఆ రెండు పార్టీలు ఏకమైనప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాల్లో గెలుస్తుందని సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. కుమారస్వామి ప్రకటనపై ఇక్కడ విలేకరులు అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ... 'బీజేపీ, జేడీ(ఎస్) నీళ్లలోంచి బయటకు వచ్చిన చేపల్లా కష్టపడుతున్నాయి. ఆ పార్టీలు భ్రమలో ఉన్నాయన్నారు. 'సువర్ణ విధాన సౌధ'లోని అసెంబ్లీ ఛాంబర్‌లో సావర్కర్ లైఫ్‌సైజ్ చిత్రపటాన్ని తొలగించాలని మంత్రి ప్రియాంక్ ఖర్గే పట్టుబట్టడంపై మాట్లాడుతూ 'ఇది స్పీకర్‌కు సంబంధించిన విషయం' అని అన్నారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అన్ని సమస్యలపై స్పందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని... తమ ప్రభుత్వంలో జాప్యం లేదా సమయం వృథా చేసే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు.

శబరిమలలో పోటెత్తిన భక్తులు

లైన్‌లో కుప్పకూలి బాలిక మృతి

తిరువనంతపురం: కేరళ లోని ప్రముఖ యాత్రాస్థలం శబరిమల ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోంది. దీంతో కొండ మొత్తం అయ్యప్ప భక్తులతో కిక్కిరిసిపోతోంది. లైన్లో ఎక్కువ సమయం నిరీక్షించలేక చాలా మంది యాత్రికులు క్యూ వ్యవస్థను అతిక్రమించి బారికేడ్‌లను దూకేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కారణంగా పవిత్ర మెట్ల దగ్గర రద్దీ పెరుగుతోంది. రద్దీ ఎక్కువగా ఉండటంతో అధికారులు కూడా భక్తులను నిలువరించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు అక్కడ గందరగోళానికి కారణమవుతున్నాయి. దర్శనం కోసం లైన్‌లో వేచివున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన 11 ఏళ్ల బాలిక ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. సుదీర్ఘ సమయం లైన్‌లో వేచి ఉన్న బాలిక ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే అప్రమత్తమైన ఆలయాధికారులు బాలికను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. బాలిక గత మూడేళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. రద్దీ పెరుగుదలపై కేరళ మంత్రి రాధాకృష్ణన్, ట్రావెన్‌కోర్ బోర్డు అధ్యక్షుడు ప్రశాంత్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వర్చువల్ క్యూ బుకింగ్ పరిమితిని 10,000 తగ్గించారు. అంతేకాకుండా రోజువారీ గరిష్ఠ భక్తుల సంఖ్య పరిమితిని 90 వేల నుంచి 80 వేలకు కుదించారు. భద్రతా చర్యలను పటిష్ఠం చేయడంలో భాగంగా సన్నిధానం వద్ద ప్రత్యేక రెస్క్యూ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణమే వైద్య సేవలు అందజేయనున్నట్టు వెల్లడించారు. కాగా, రెండు నెలల పాటు సాగే దర్శనాల్లో భాగంగా శబరిమల అయ్యప్ప ఆలయం గత నెల 17వ తేదీ నుంచి తెరుచుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మండల- మకరవిళక్కు వేడుకలు 17వ తేదీ నుంచే ప్రారంభమయ్యాయి. దీంతో మండల పూజల కోసం శబరిమల ఆలయాన్ని అధికారులు తెరిచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.